
RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY తెలుగు దినపత్రిక

| మల్కాజిగిరి | సంపుటి : 3 | సంచిక : 275 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ | గురువారం, ఏప్రిల్,30, 2026 | పేజీలు : 8 వెల : రూ.4/- |
|---|---|---|---|---|---|
| MALKAJGIRI | VOLUME : 3 | ISSUE NO : 275 | EDITOR : MERUGU CHANDRAMOHAN | Thursday, April, 30, 2026 | PAGES : 8 RS : 4 /- |



చారిత్రక చిత్రాలకు బదులు..

## ట్రంప్ ఫొటో


## యూఎస్ పాస్‌పోర్టుల్లో కీలక మార్పు

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ మరో అసాధారణ నిర్ణయంతో వార్తల్లో నిలిచారు. ప్రభుత్వ సంస్థలపై తనదైన ముద్ర వేస్తున్న ఆయన, ఇప్పుడు అమెరికన్ పాస్‌పోర్టులపై కూడా తన ఫొటో, సంతకాన్ని ముద్రించనున్నారు. ఈ చర్యతో దశాబ్దాలుగా పాటిస్తున్న ఓ సంప్రదాయానికి తెరదించినట్టయింది. అమెరికా స్వాతంత్ర్య ప్రకటనకు 250 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈ ప్రత్యేక పాస్‌పోర్టులను విడుదల చేయనున్నట్టు యూఎస్ స్టేట్ డిపార్ట్‌మెంట్ మంగళవారం అధికారికంగా ధ్రువీకరించింది. ఫాక్స్ న్యూస్, ది బుల్వార్క్‌లో వచ్చిన కథనాల తర్వాత స్టేట్ డిపార్ట్‌మెంట్ ఈ ప్రకటన చేసింది. ఈ కొత్త పాస్‌పోర్టు లోపలి పేజీల్లో రెండు చిత్రాలు ఉండనున్నాయి.

మోదీ ఫుట్‌బాల్ ఆట..


ప్రధాని క్రీడా స్ఫూర్తి అద్భుతమంటూ

## ఫిఫా అధ్యక్షుడి ప్రశంసలు



**ఇన్‌స్టాగ్రామ్‌లో ఫొటో షేర్ చేసిన జియాన్నీ ఇన్ఫాంటినో ఫుట్‌బాల్ ప్రపంచాన్ని ఏకం చేస్తుందని వ్యాఖ్య**

డిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ క్రీడా స్ఫూర్తిపై అంతర్జాతీయ ఫుట్‌బాల్ సమాఖ్య (ఫిఫా) అధ్యక్షుడు జియాన్నీ ఇన్ఫాంటినో ప్రశంసలు కురిపించారు. సిక్కిం పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ చిన్నారులతో కలిసి ఫుట్‌బాల్ ఆడుతున్న ఫొటోను ఆయన తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పంచుకున్నారు. మంగళవారం గ్యాంగ్‌టక్‌లో పర్యటించిన ప్రధాని మోదీ, అక్కడి చిన్నారులతో సరదాగా ఫుట్‌బాల్ ఆడారు. ఇది తనకు ఎంతో ఉత్సాహాన్ని ఇచ్చిందని, ఆ యువ మిత్రులతో గడపడం ఆనందంగా ఉందని 'ఎక్స్' వేదికగా ఫొటోలను పంచుకున్నారు. ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.



తెలంగాణ టెన్త్ ఫలితాలు

## విడుదల

**మొత్తం 95.1 శాతం ఉత్తీర్ణత**
**96.26 శాతం ఉత్తీర్ణతతో ముందున్న బాలికలు**
**ఫలితాల్లో ములుగు జిల్లా ఫస్ట్.. హైదరాబాద్ లాస్ట్**

హైదరాబాద్,తెలంగాణ దిశ :తెలంగాణ పదో తరగతి పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. బుధవారం మధ్యాహ్నం ప్రభుత్వ సలహా దారు కే.కేశవరావు ఫలితాలను విడుదల చేశారు. మొత్తం 95.1 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఈ ఏడాది 5 లక్షల 28 వేలకు పైగా విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాశారు. టెన్త్ ఫలితాల్లో బాలికలదే పైచేయిగా నిలిచింది. బాలికలు 96.26 శాతం ఉత్తీర్ణత సాధించగా.. బాలురు 94.07 శాతం ఉత్తీర్ణత పొందారు. 5,731 స్కూళ్లలో వంద శాతం ఉత్తీర్ణత నమోదవగా.. 6 పాఠశాలల్లో సున్నా శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు విద్యాశాఖ వెల్లడించింది.



సీఎం రేవంత్‌తో

## కొత్త డిజిపి ఆనంద్ భేటీ

- తనపై నమ్మకంతో డిజిపిగా నియమించినందుకు కృతజ్ఞతలు
- నేడు పదవీవిరమణ చేయనున్న ప్రస్తుత డిజిపి
- 1న బాధ్యతలు తీసుకోనున్న ఆనంద్

హైదరాబాద్,తెలంగాణ దిశ : తెలంగాణ నూతన డీజీపీగా నియమితులైన సీనియర్ ఐపీఎస్ అధికారి సీవీ ఆనంద్ సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం మధ్యాహ్నం హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్ లో భేటీ అయ్యారు. రాష్ట్ర శాంతిభద్రతల పరిరక్షణలో తనపై నమ్మకం ఉంచి డీజీపీగా బాధ్యతలు అప్పగించినందుకు సీఎంకు ఈ సందర్భంగా సీవీ ఆనంద్ కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్రంలో నేరాల నియంత్రణ, డ్రగ్స్ రహిత తెలంగాణ లక్ష్యం,పోలీస్ వ్యవస్థను ప్రజలకు మరింత చేరువ చేసే అంశాలపై సీఎం ఈ సందర్భంగా పలు సూచనలు చేసినట్లు సమాచారం. గతంలో హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా సమర్థవంతంగా పనిచేసిన అనుభవం ఉన్న సీవీ ఆనంద్, ఇప్పుడు రాష్ట్ర పోలీస్ బాస్ గా పగ్గాలు చేపట్టడంతో పోలీస్ శాఖలో సరికొత్త ఉత్సాహం కనిపిస్తోంది.సీఎం రేవంత్ రెడ్డి సీవీ ఆనంద్‌కు శుభాకాంక్షలు తెలుపారు. రాష్ట్ర ప్రయోజనాలే పరమావధిగా విధులు నిర్వహించాలని సూచించారు.



యూపీ రాష్ట్ర అభివృద్ధిలో..

## మరో మైలురాయి

## దేశంలోనే అతిపెద్ద గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్ట్..

వారణాసి: ఉత్తరప్రదేశ్ మౌలిక వసతుల కల్పనలో చరిత్ర సృష్టించిన ప్రాజెక్టు గంగా ఎక్స్‌ప్రెస్‌వే. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ చేతుల మీదుగా ప్రారంభమైన ఈ భారీ రహదారి, రాష్ట్ర భవిష్యత్తును మలుపు తిప్పే శక్తిగా నిలుస్తోంది. దేశంలోనే అతిపెద్ద 'గ్రీన్ ఫీల్డ్' ఎక్స్‌ప్రెస్‌వేగా అవతరించిన ఈ ప్రాజెక్టు, కేవలం రవాణా సౌకర్యమే కాదు, రాష్ట్ర పారిశ్రామిక, ఆర్థిక ప్రగతికి పట్టుగొమ్మగా మారనుంది. ఒకప్పుడు దూరంగా అనిపించిన ప్రాంతాలను దగ్గర చేస్తూ, ప్రజల జీవన ప్రమాణాలను పెంచడంలో ఇది కీలక పాత్ర పోషిస్తోంది.

అద్భుతమైన ఇంజనీరింగ్..: దాదాపు రూ. 36,230 కోట్ల భారీ వ్యయంతో అత్యున్నత ప్రమాణాలతో నిర్మించిన ఈ రహదారి 594 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. ఆరు వరుసల (6-శ్రీఘఅవ) సామర్థ్యంతో నిర్మించిన ఈ మార్గం, అత్యాధునిక సాంకేతికతతో అత్యంత వేగవంతమైన ప్రయాణానికి వీలు కల్పిస్తుంది.




## మేము చేయని ప్రజా పోరాటం లేదు

**మంత్రి పదవి కావాలని ఎప్పుడూ అడగలేదు**
**ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్**


హైదరాబాద్,తెలంగాణ దిశ : రాష్ట్రంలో టీజేఎస్ పాల్గొనని ప్రజా పోరాటాలు లేవని ఎమ్మెల్సీ కోదండరాం అన్నారు. టీజేఎస్ ఆవిర్భావ దినోత్సవంలో ఆ పార్టీ అధ్యక్షుడు కోదండరాం పాల్గొన్నారు. రాజకీయా వ్యూహాల్లో భాగంగానే కాంగ్రెస్‌కు మద్దతిచ్చాం. మంత్రులం, ఎమ్మెల్యేలం కావాలని మాకు లేదు. మంత్రి పదవి ఇస్తానని కాంగ్రెస్ చెప్పలేదు.. నేను అడగలేదు. అవసరమైనప్పుడు ప్రజలకు తోడుగా ఉన్నాం. మే 12న జరిగే ప్లీనరీలో కీలక నిర్ణయాలు తీసుకుంటాం అని అన్నారు. 'మేము ప్రభుత్వ పదవులు, నామినేటెడ్ పోస్టులు కావాలని అడుగుతున్నాం. ఈసారి మా పార్టీ నేతలకు నామినేటెడ్ పోస్టులు ఇస్తారని నమ్ముతున్నాం' అని అన్నారు.

## ప్రాణహితపై వెనక్కి తగ్గేది లేదు

**ప్రతిపాదనలు సిద్ధం చేశాం**
**మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి**



హైదరాబాద్,తెలంగాణ దిశ : ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ప్రాజెక్టు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామని స్పష్టం చేశారు. మంత్రి బుధవారం మీడియాతో మాట్లాడారు. తుమ్మడిహట్టి నుంచి ఎల్లంపల్లికి నీటిని తరలించి లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించేందుకు భగీరథ ద్వారా ప్రయత్నం జరుగుతోందని చెప్పారు. తుమ్మిడిహట్టి నుంచి ఎల్లంపల్లికి ప్రత్యామ్నాయ ప్రతిపాదనలను పరిశీలిస్తున్నామని తెలిపారు.



సోనమ్‌కు బెయిల్‌పై

## సవాల్

**మేఘాలయ హైకోర్టులో సవాల్ చేయాలని నిర్ణయం**

భోపాల్,ఏప్రిల్29 : సంచలనం సృష్టించిన మేఘాలయ హనీమూన్ హత్య కేసులో నిందితురాలు సోనమ్‌కి బెయిల్ ఇవ్వడంపై సవాల్ చేయాలని రఘువంశీ కుటుంబం నిర్ణయించింది. సోనమ్‌కు బెయిల్ రావడంపై రాజా రఘువంశీ కుటుంబం ఆశ్చర్యపోయింది. దీనిపై మేఘాలయ హైకోర్టును ఆశ్రయించ నున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సోనమ్ అరెస్టు సమయంలో పోలీసులు చేసిన తప్పిదం వల్లే ఆమెకు బెయిల్ మంజూరైనట్లు తాజాగా బయటకొచ్చింది. దీనిపై బాధిత రఘువంశీ కుటుంబం మేఘాలయ హైకోర్టును ఆశ్రయించేందుకు సన్నద్ధమవుతుంది. భారతీయ న్యాయ సంహిత ప్రకారం.. హత్యకు సంబంధించి నిందితులపై 103(1) సెక్షన్ విధించాలి.



అన్ని పంటలు కొనుగోలు

## చేయాలి

**సీఎం రేవంత్ రెడ్డి హరీశ్‌రావు లేఖ**

హైదరాబాద్,తెలంగాణ దిశ : కాంగ్రెస్ రైతు డిక్లరేషన్ పెద్ద బోగస్ అని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు విమర్శించారు. ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన రుణమాఫీ హామీని పూర్తిగా అమలు చేయలేదని.. పంట కొనుగోళ్లలోనూ ప్రభుత్వం రైతులను ఇబ్బంది లకు గురిచేస్తుందని అన్నారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్ రావు బహిరంగ లేఖ రాశారు. ఎన్నికల వేళ చెప్పిందొకటి.. అధికారం లోకి వచ్చాక చేసేదొకటి.. కాంగ్రెస్ రైతు డిక్లరేషన్ పెద్ద బోగస్ అని హరీశ్‌రావు విమర్శించారు. తాలు పేరిట తరుగు తీస్తే తోలు తీస్తా అన్న సీఎం రేవంత్ రెడ్డి.. వడ్ల కొనుగోలు కేంద్రాల్లోకి వెళ్లి చూడాలన్నారు. కొనుగోలు కేంద్రాలకు వరి ధాన్యం కుప్పలు తెప్పలు గా వస్తున్నా ఇంకా కొనుగోళ్లు ఎందుకు మొదలుపెట్టలేదని ప్రశ్నించా రు. మిల్లుల దగ్గర కూడా బస్తాకుకిలో, రెండు కిలోల తరుగు తీస్తూ రైతులనుదోచుకుంటున్నారని మండిపడ్డారు.ఎండల్లో రైతులు మాడిపో తున్నా ప్రభుత్వానికి సోయి లేదా అని ప్రశ్నించారు. మాట ఇచ్చిన ప్రకారం సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ వెంటనే ధాన్యం డబ్బులతో పాటే ఇవ్వాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. పొద్దుతిరు గుడు రైతుల కష్టాలు కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టవా? 20 రోజులుగా కేంద్రాల వద్ద రైతులు పడిగాపులు కాస్తున్నారని తెలిపారు.

## లేదంటే రైతుల పక్షాన పోరాటం చేస్తాం..

# కాలనీల సమగ్ర అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

## - కాంగ్రెస్ నేత నెమలి అనిల్ కుమార్





**మల్లాపూర్, ఏప్రిల్ 29, (తెలంగాణ దిశ) :**శక్తి సాయి నగర్ డివిజన్ పరిధిలో అభివృద్ధి పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని కాంగ్రెస్ పార్టీ గ్రేటర్ హైదరాబాద్ సీనియర్ నాయకులు నెమిలి అనిల్ కుమార్ తెలిపారు. స్థానిక మల్లికార్జున్ నగర్ కాలనీ, రోడ్ నెంబర్--1లో సుమారు రూ.17 లక్షల వ్యయంతో నూతన భూగర్భ డ్రైనేజీ పనులు కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జీ మందుముల పరమేశ్వర్ రెడ్డి సహకారంతో మంజూరయ్యాయని తెలిపారు. ఈ శుభ సందర్భంగా ఉమ్మడి మల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు నెమలి అనిల్ కుమార్ ముఖ్య పాత్ర పోషిస్తూ కార్యక్రమాన్ని సమన్వయం చేసి, స్థానిక ప్రజల సమస్యలను పరిష్కరించడంలో తన కృషిని మరోసారి చాటుకున్నారు. ఆయన నాయకత్వంలో డివిజన్ అభివృద్ధి మరింత వేగం పుంజుకుంటోందని స్థానికులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు కప్పర సాయి, పీజీ సుదర్శన్, దంతురి రాజు గౌడ్, జమీలా బేగం, ముజీబ్, బెల్లం శ్రీను, ఎస్వీ కిట్టు, డివిజన్ వర్కింగ్ ప్రసిడెంట్ కోయగూర బాలరాజు, వైస్ ప్రెసిడెంట్ జానీ భాయ్, ప్రభాకర్ రెడ్డి, పర్వతాలు, మధుసూదన్ రెడ్డి,మనోహర్, ఫిరోజ్, టిల్లు ముదిరాజ్, శ్రీనివాస్, అన్వర్, ఉపేందర్, మెరుపుల జయంత్ గౌడ్, శైలజ, ఇంతియాజ్, సోనీ, ధనంజయతో పాటు కాలనీ వాసులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కాలనీ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తా

## - ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి





**కాప్రా,ఏప్రిల్ 29, (తెలంగాణ దిశ) :**కాప్రా డివిజన్ పరిధిలోని అశోక్ కాలనీ, సాయి సుమ ఎన్‌క్లేవ్ ప్రాంతాలలో రూ. 75 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు. స్థానిక ప్రజలు సౌకర్య వంతంగా ప్రయాణించేందుకు ఈ రోడ్లు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు.కాలనీ వాసులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు బైరీ నవీన్ గౌడ్ కాలనీ నివాసులు తదితరులు పాల్గొన్నారు.

# 'పది'ఫలితాలలో విజయ హైస్కూల్ విద్యార్థుల విజయ దుందుభి




**కాప్రా, ఏప్రిల్ 29, (తెలంగాణ దిశ) :**తెలంగాణ పదవ తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాలలో విజయ హైస్కూల్, ఆదిత్య నగర్, కాప్రా విద్యార్థులు ఎప్పటిలాగే ఈ సంవత్సరం కూడా విజయదుందుభి మోగించి కాప్రా మండలంలోనే వంద శాతం అద్భుత ఫలితాలతో అగ్రస్థానంలో నిలిచింది. పాఠశాల టాపర్ గా అత్యధిక మార్కులు పొందిన సాహితీ- 584, మేఘనాలహరి- 582, వరునిక - 579, భానువర్ధన్ రెడ్డి - 578, హర్షవర్ధన్- 578,కృష్ణ- 577, యామిని- 576, శివాని - 574, స్నిగ్ధ - 573, విజయ్ కుమార్ నాయక్ - 572, కే.కీర్తన - 571 గుణములను పొందారు. ఇవేగాక 550 మార్కులకు పైగా 33 మంది, 500 మార్కులకుపైగా 92 మంది విద్యార్థులు ఉత్తమ ప్రతిభను సాధించారు. అనంతరం ఉత్తమ ఫలితాలతో ప్రతిభను చాటిన విద్యార్థులకు పాఠశాల ఆవరణలో సన్మాన కార్యక్రమం ఏర్పాటుచేసి పాఠశాల యాజమాన్యం అభినందనలు తెలిపి ఘనంగా సన్మానించారు. మిఠాయిలను వితరణ చేసి,బాణాసంచా కాల్చి హర్షం వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాల యాజమాన్యం ఉత్తమ ఫలితాలను సాధించిన ఉపాధ్యాయుల కృషిని కొనియాడారు. ఈ సన్మాన కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ కొప్పునూరి బసప్ప, వ్యవస్థాపకురాలు విజయలక్ష్మి, కరస్పాండెంట్ కొప్పునూరి రాజేశ్వర్, డైరెక్టర్ కొప్పునూరి వీణ, ప్రిన్సిపాల్ దేవినేని వెంగబాబు, ప్రధానోపాధ్యాయురాలు అద్దంకి పద్మావతి, పదవ తరగతి ఉపాధ్యాయులు, మిగతా ఉపాధ్యాయుల బృందం విద్యార్థులు పాల్గొన్నారు.




# పదవ తరగతి ఫలితాల్లో నాగారం సెరినిటి ప్రభంజనం








**నాగారం, ఏప్రిల్ 29, (తెలంగాణ దిశ) :** 2026 పదవ తరగతి పరీక్షలలో నాగారం సెరినిటి విద్యార్థులు మరోసారి తమ సత్తా చాటారు. వంద శాతం ఫలితాలతో 588 అత్యధిక మార్కులతో మెరిసారు. జి. అక్షర రెడ్డి అత్యధికంగా 588 మార్కులు సాధించింది. సిహెచ్. దివ్య గాయత్రి 587 మార్కులతో, జి. మౌనిక 586 మార్కులతో రెండు, మూడు స్థానాలు పొందారు.
ఎండి. ఆయేషా 579, అర్చిత 578 మార్కులతో ప్రతిభను చాటారు. అత్యధిక మార్కులతో మొదటి మూడు స్థానాలు సాధించిన విద్యార్థులను ఘనంగా సత్కరించి, ఒక్కొక్కరు కు పదివేల రూపాయల నగదు బహుమతిని పాఠశాల ప్రిన్సిపాల్, కరస్పాండంట్ నోముల జంగిరెడ్డి అందజేశారు. 29 మంది విద్యార్థులు 550 పైగా మార్కులు సాధించారు. అత్యద్భుతమైన ఫలితాలు సాధించిన విద్యార్థులను, అందకు కృషిచేసిన ఉపాధ్యాయులను పాఠశాల ముఖ్య కార్యదర్శి నోముల వసంత, కరెస్పాండంట్ నోముల జంగిరెడ్డి మనఃపూర్వకంగా అభినందించారు.

# కుషాయిగూడలో కన్నుల పండువగా హోమం, జల నివాసం, మూల విరాట్ అభిషేకం





**కుషాయిగూడ, ఏప్రిల్ 29, (తెలంగాణ దిశ) :**కుషాయిగూడలో మేన 54 అడుగుల భారీ హనుమాన్ విగ్రహం ప్రతిష్టాపన మహోత్సవంలో బుధవారం భాగంగా హోమం, జల నివాసం, మూల విరాట్ అభిషేకం కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా అఖండ దీపారాధన, అగ్నిప్రతిష్ట హారతి తదితర పూజా కార్యక్రమాలతో పాటు హోమంలో సుమారు 19 జంటలు భక్తి శ్రద్ధలతో పాల్గొన్నారు. మారుతీ మిత్ర మండలి ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. వందలాది మంది భక్తులు అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు ఆంజనేయ స్వామి మాలలు ధరించి నిష్ఠతో పూజలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత గుప్తా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శృంగేరి శంకరపేట ఆస్థాన పౌరాణికులు బ్రహ్మశ్రీ భాషణం పల్లి సంతోష్ కుమార్ శాస్త్రి, దేవీ ఉపాసకులు బ్రహ్మశ్రీ చిట్టి పెద్ది, రామ్ కుమార్ శర్మ, వేద పండితులు ప్రతిష్టాపన ఆచార్యులు ప్రతిష్ట బ్రహ్మశ్రీ నిష్టల శివరామ శర్మ, బ్రహ్మశ్రీ ఆర్. శివ కార్తీక్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

# పోలవరంపై సందేహాలకు తెర..

## పూర్తి ఎత్తుతోనే నిర్మాణం



- పోలవరం ప్రాజెక్టు ఎత్తుపై నెలకొన్న సందేహాలకు తెర
- గరిష్ఠ ఎత్తు 45.72 మీటర్లుగా పీపీఏ అధికారిక ప్రకటన
- కేంద్ర జలశక్తి కార్యదర్శి పర్యటన తర్వాత మారిన చిత్రం
- వచ్చే ఏడాది జూన్ నాటికి తొలి దశ పనులు పూర్తికి లక్ష్యం

**పోలవరం,తెలంగాణ దిశ :**బహుళార్థ సాధక పోలవరం ప్రాజెక్టు ఎత్తు విషయంలో నెలకొన్న సందేహాలకు తెరపడింది. ప్రాజెక్టును దాని పూర్తిస్థాయి ఎత్తయిన 45.72 మీటర్ల వద్దే నిర్మించనున్నట్లు పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) అధికారికంగా స్పష్టం చేసింది. దీంతో ప్రాజెక్టులో 194.60 టీఎంసీల నీటిని నిల్వ చేసేందుకు మార్గం సుగమమైంది. పీపీఏ తన అధికారిక వెబ్‌సైట్‌లో ఈవివరాలను పొందుపరచడంతో ప్రాజెక్టు భవిష్యత్తుపై స్పష్టత వచ్చింది.ఇటీవల కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి వీఎల్ కాంతారావు ప్రాజెక్టును సందర్శించిన తర్వాత ఈ కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆయన పర్యటనకు ముందు, ప్రాజెక్టును తొలి దశలో 41.15 మీటర్లకే పరిమితం చేస్తారన్న సమాచారం పీపీఏ వెబ్‌సైట్‌లో ఉండేది. అయితే, కాంతారావు పర్యటన అనంతరం ఆ వివరాలను సవరించి, గరిష్ఠ నీటిమట్టం వివరాలను చేర్చారు. ప్రాజెక్టు రెండో దశకు అవసరమైన అటవీ, పర్యావరణ అనుమతులు, భూసేకరణ, పునరావాసం వంటి అంశాలను కేంద్ర ప్రభుత్వమే పర్యవేక్షిస్తుందని ఆయన హామీ ఇచ్చారు. ఈ హామీతో రెండో దశ పనులకు కేంద్రం సిద్ధమవుతోందన్న సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.మరోవైపు, ప్రాజెక్టు తొలిదశ పనులను వచ్చే ఏడాది జూన్ నాటికి పూర్తిచేయాలని జల వనరుల శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే స్పిల్‌వే నిర్మాణం పూర్తవగా, ఎర్త్ కమ్ రాక్ ఫిల్ డ్యాం పనులు వేగంగా సాగుతున్నాయి. ప్రాజెక్టు పూర్తయితే 10.13 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణతో పాటు, కృష్ణా బేసిన్‌కు 80 టీఎంసీల నీటి తరలింపు, తాగునీరు, 960 మెగావాట్ల విద్యుదుత్పత్తి వంటి ప్రయోజనాలు చేకూరనున్నాయి. అయితే, రెండో దశ పనులు ప్రభుత్వానికి పెద్ద సవాలుగా మారనున్నాయి. రెండో దశ కోసం సుమారు 86,000 నిర్వాసిత కుటుంబాలను తరలించాల్సి ఉండగా, భూసేకరణ, పునరావాసానికి రూ.28,561 కోట్లకు పైగా ఖర్చవుతుందని అంచనా.

# వివేకానంద మోడల్ హైస్కూల్‌లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



**కాప్రా, ఏప్రిల్ 29, (తెలంగాణ దిశ) :**కాప్రా డివిజన్ సాయిరామ్ నగర్‌లోని వివేకానంద మోడల్ హైస్కూల్‌లో గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ఎంతో ఉత్సాహ భరితమైన వాతావరణంలో ఆనందోత్సవాల మధ్య నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీనివాస్ గౌడ్ విద్యార్థుల ప్రతిభను అభినందిస్తూ వారికి మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. విద్యార్థులందరూ గ్రాడ్యుయేషన్ కాప్స్ ధరించి ఆత్మ విశ్వాసంతో మెరిసిపోయారు. తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ పిల్లల విజయాలను చూసి ఆనందం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు తమ అనుభవాలను పంచుకుంటూ భవిష్యత్తులో ఎలా ముందుకుసాగాలో మార్గదర్శనం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, నైతిక విలువలు పాటిస్తూ కష్టపడి చదివితే జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకుంటారని అన్నారు. ఈ రోజు పొందిన గౌరవాలు మీ భవిష్యత్తుకు బలమైన పునాదులు వేస్తాయని అన్నారు.



# పైసలు లేకుండానే పదవులు!

## ఉత్సవ విగ్రహాలుగా నామినేటెడ్ నేతలు

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెం టనే 37 మందిని చైర్మన్లుగా నామినేటెడ్ పదవుల్లో భర్తీచేసింది. ఆ తర్వాత మరో ఐదారుగు రిని ప్రభుత్వం నియమించింది. ఇంకా భర్తీచేయని నామినేటెడ్ పోస్టులు 30కి పైగానే ఉన్నాయి. అయితే మొదటి విడతలో భర్తీచేసిన వాటిలో కీలకమైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనా ర్టీ, మహిళా, దివ్యాంగులతో పాటు వివిధ కులాల కార్పోరేషన్లు కూడా ఉన్నాయి.మొదటగా భర్తీచేసిన చైర్మన్ల పదవీ కాలం జూలై రెండోవారంలో ముగుస్తుంది. అయితే వీరి పదవీ కాలంలో ఏ ఒక్కరికి కూడా కార్పోరేషన్ల ద్వారా నిధులు ఇవ్వలేదు. దాంతో కార్పోరేషన్ల ద్వారా సాయం చేయలేని పరిస్థితి నెలకొన్నది. ఆయా కార్పోరేషన్ల చైర్మన్లకు రుణాలు ఇప్పించాలని నిత్యం ఒత్తిడి ఉన్నా.. చైర్మన్లు చేసేదేమీలేక మిన్నకుండిపోతున్నారు.పార్టీ ఇచ్చిన కార్యక్రమాలు, సమావేశాలకు వెళ్లడం తప్ప.. ప్రభుత్వపరంగా నిరుద్యోగ యువతకు, నమ్ముకున్న కేడర్‌కు న్యాయంచేయలేని పరిస్థితి వారిది. పదవీకాలం ముగియనుండటం తో తమకు మరోసారి అవకాశం కల్పించాలని ప్రభుత్వ పెద్దలకు విజ్ఞప్తి చేస్తున్నట్లుగా తెలుస్తున్నది. రాష్ట్రంలోని వివిధ కార్పోరేషన్ల ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించలేని దుస్థితి నెలకొన్నది. నిధుల లేమితో గతేడాది అట్టహాసంగా ప్రారంభించిన యువ వికాసం పథకం అటకెక్కింది. ఈ పథకం కోసం లక్షలాది మంది దరఖాస్తులు చేసుకున్నారు. అయితే సర్కార్ నిధులు విడుదల చేయకపోడంతో నిరుద్యోగ యువత ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఇక ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, పిషర్మెన్, వికలాంగులతో పాటు వివిధ కులాల ఫెడరేషన్లు, కార్పోరేషన్లలో.. యువతకు ఉమ్మడి రాష్ట్రం లో ప్రతి ఏటా సబ్సిడీ ద్వారా ప్రభుత్వం రుణాలు ఇవ్వడం జరుగుతుండేది. కానీ, రాష్ట్ర విభజన తర్వాత పరిస్థితి మారి పోయింది. బీఆర్ఎస్ హయాంలో రెండు, మూడేళ్లు నిరుద్యోగ యువతకు రుణాలు ఇచ్చినా.. వాటికి సబ్సిడీని విడుదల చేయలేదు. కాంగ్రెస్ ప్రభు త్వం ఏర్పడి రెండున్నరేళ్లు పూర్తికావస్తున్నా ఇప్పటివరకు ఒక్కరికి కూడా ఆయా కార్పోరేషన్ల ద్వారా రుణాలు ఇవ్వలేదు. ఎన్నికల ముందు ఇప్పుడున్న కార్పోరేషన్లకు అదనంగా కులాలవారీగా కార్పోరేషన్లు ఏర్పాటుచేసి.. ఆయావర్గాల యువతను రుణాలు ఇచ్చి ఆర్థికంగా బలోపేతం చేస్తామన్న హామీ నీటి మూటగానే మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ సర్కార్ కార్పోరేషన్ల ద్వారా కొత్త రుణాలు ఇవ్వకపోగా.. గత ప్రభుత్వం హయాంలో ఇ చ్చిన రుణాలకు కనీసం సబ్సిడీ నిధులను కూడా విడుదల చే యడం లేదు. దీంతో గతంలో రుణాలు తీసు కున్న వ్య క్తులు.. తిరిగి బ్యాంకులకు అప్పులు చెల్లించలేని పరిస్థితి నెలకొన్నది.

# సంపాదకీయం

## స్వదేశీ ప్రచారం

శక్తివంతమైన, అభివృద్ధి చెందిన భారత్‌కు.. స్వయంసమృద్ధి చెందిన భారతదేశమే పునాది. రక్షణ, సాంకేతికత, ఇంధన, అంతరిక్షంతో పాటు తయారీ రంగాల్లో పురోగతి 2047 నాటికి మనల్ని అభివృద్ధి చెందిన భారత్‌గా నిలుపుతుంది'ఇటీవల 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ.. ఆత్మనిర్భర్ భారత్, మేకిన్ ఇండియా వంటి కార్యక్రమాలను నొక్కిచెబుతూ చేసిన వ్యాఖ్యలివి.యువత స్వదేశంలోనే జెట్ ఇంజిన్లు, సెమీకండక్టర్ చిప్స్, ఇతర సాంకేతిక ఉత్పత్తులను అభివృద్ధి చేయాలని కోరుతున్నా. తద్వారా మనం స్వయంసమృద్ధి సాధించగలం" అని అన్నారు.స్వయంసమృద్ధి అంటే, కేవలం దేశానికే పరిమితం కాదని.. ఇతర దేశాలతో పరస్పర సహకారం కొనసాగిస్తూ శక్తిసామర్థ్యాలను, స్వయంప్రతిపత్తిని పెంపొందించుకోవడమని కూడా అన్నారు.కార్లు, ఫోన్ల తయారీ నుంచి వస్త్రాలు, ఆహార భద్రత వరకూ భారత్ గత కొన్నేళ్లుగా అద్భుతమైన పురోగతి సాధించింది.అయితే, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో గందరగోళ పరిస్థితులు, భారత్‌పై అమెరికా 50 శాతం సుంకాల విధింపు వంటి వాటి కారణంగా, 'స్వదేశీ' ప్రచారం ఊపందుకుంటోంది. వ్యవసాయం, మైనింగ్, ఇనుము, ఉక్కు, వాహనాల విడిభాగాలు, పారిశ్రామిక యంత్రాలు, ఫర్నిచర్, తోలు, పాదరక్షల తయారీ, దేశీయ రక్షణ రంగ ఉత్పత్తులు, ఐటీ, ఇతర డిజిటల్ సేవల రంగాల్లో భారత్ స్వావలంబన సాధించింది.కానీ, ఇంకా విదేశీ ముడి పదార్థాలు, టెక్నాలజీ, రీసర్చ్‌పై ఆధారపడిన అనేక రంగాలున్నాయి.మొబైల్ ఫోన్లు, అత్యాధునిక ఎలక్ట్రానిక్ పరికరాల తయారీకి అవసరమైన సెమీకండక్టర్ చిప్స్ వంటి హైటెక్ ముడి వస్తువులను భారత్ దిగుమతి చేసుకుంటోంది.అంతేకాకుండా.. చైనా సాంకేతిక నైపుణ్యం, సరసమైన ధరల కారణంగా భారత్ ఈ వస్తువుల కోసం చైనాపై ఎక్కువగా ఆధారపడుతోంది.ఈ సెమీకండక్టర్, ఎలక్ట్రానిక్స్ రంగంలో స్వావలంబన సాధించే దిశగా భారత్ ఇప్పటికే విధానపరమైన నిర్ణయాల విషయంలో చొరవ తీసుకుంది.మేక్ ఇన్ ఇండియా, ఇండియా సెమీకండక్టర్ మిషన్, ప్రొడక్ట్ లింక్డ్ ఇన్సెంటివ్ వంటి స్కీముల ద్వారా భారత్‌లో సెమీకండక్టర్లు, ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తికి అనువైన వాతావరణాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రయత్నాలు చేస్తోంది.ముడి పదార్థాలు/వస్తువుల లభ్యత గురించి ఎలిస్టా కన్స్యూమర్ ప్రొడక్ట్స్ సీఎండీ సాకేత్ గౌరవ్ మాట్లాడుతూ, "మేం స్మార్ట్ టీవీలను తయారుచేస్తాం. వాటిలో వినియోగించే ముఖ్యమైన విడిభాగాలను విదేశాల నుంచి దిగుమతి చేసుకోవాలి. మా ఉత్పత్తులలో వినియోగించే అనేక భాగాలను ఇప్పటికీ దిగుమతి చేసుకుంటున్నాం. అవి భారత్‌లో తయారవడం లేదు" అని చెప్పారు.ఎలిస్టా కంపెనీ ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లోని కడపలో రూ.250 కోట్లతో మాన్యుఫాక్చరింగ్ యూనిట్‌ను ప్రారంభించింది."అలాగే భారతీయ బ్రాండ్లు ఎదుర్కొంటున్న ప్రధాన సవాళ్లలో ఒకటి ఏంటంటే.. ఇక్కడ తయారైన వస్తువులు నాణ్యత పరంగా బాగున్నప్పటికీ, మన వినియోగదారులు విదేశీ బ్రాండ్లనే ఇష్టపడతారు" అని సాకేత్ గౌరవ్ అన్నారు.అయితే, రానున్న ఐదేళ్లలో సెమీకండక్టర్స్, ఎలక్ట్రానిక్స్ రంగంలో భారత్ స్వయంసమృద్ధి సాధిస్తుందని కూడా ఆయన అన్నారు."ఐదు నుంచి ఆరేళ్లలో ముఖ్యమైన విడిభాగాలను ఇక్కడే తయారు చేయగలమని ఆశిస్తున్నా. ప్రస్తుతం, అందుకు అవసరమైన టెక్నాలజీ, ప్రాసెస్ చేసేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు లేవు" అని సాకేత్ గౌరవ్ చెప్పారు."భారత్‌లో తయారైన ఉత్పత్తులు విదేశీ బ్రాండ్ల కంటే తక్కువ ధరకే లభిస్తాయి. కానీ, వినియోగదారులు విదేశీ బ్రాండ్లనే ఇష్టపడుతున్నారు."ఎలక్ట్రిక్ వాహనాల బ్యాటరీల నుంచి టర్బైన్ల వరకు, పర్మినెంట్ మాగ్నెట్స్, లైటింగ్, రాడార్ వ్యవస్థలు, ఎలక్ట్రానిక్ యుద్ధ పరికరాలు, అనేక ఇతర రోజువారీ నిత్యవసరాలతో సహా అనేక ఉత్పత్తుల తయారీకి అవసరమైన రేర్ ఎర్త్ మెటీరియల్స్ కోసం భారత్ దిగుమతులపైనే ఆధారపడుతోంది.భారత్ తనకు అవసరమైన రేర్ ఎర్త్ మెటీరియల్స్‌లో దాదాపు 99 శాతం దిగుమతి చేసుకుంటోంది. అందుకు చైనాపైనే ఎక్కువగా ఆధారపడి ఉంది.భారత్‌లో రేర్ ఎర్త్ మెటీరియల్స్‌ను రీసైక్లింగ్ చేసే అతిపెద్ద కంపెనీల్లో ఒకటైన అటెరో సీఈవో, కంపెనీ సహ వ్యవస్థాపకులు నితిన్ గుప్తా మాట్లాడుతూ, "భారత్ ప్రస్తుతం 99 శాతం రేర్ ఎర్త్ మెటీరియల్స్‌ను దిగుమతి చేసుకుంటోంది. కానీ, ఈ పరిశ్రమ పురోగతికి అనువైన వ్యవస్థను అభివృద్ధి చేసినట్లయితే.. భారత్ 70 శాతం అవసరాలను రీసైక్లింగ్ ద్వారా తీర్చుకోవచ్చు" అని అన్నారు.అటెరో కంపెనీ ఇటీవల తన సామర్థ్యాన్ని 300 టన్నుల నుంచి 30 వేల టన్నులకు పెంచుకుంది."చాలా ముఖ్యమైన ఉత్పత్తుల తయారీలో రేర్ ఎర్త్ మెటీరియల్స్ చాలా కీలకం. భారత్ ఈ విషయంలో స్వయంసమృద్ధి సాధించే దిశగా చర్యలు చేపట్టాల్సి ఉంది. భారత్‌లోనూ రేర్ ఎర్త్ మెటీరియల్స్ నిల్వలు ఉన్నాయి, కానీ ప్రస్తుతం వాటి మైనింగ్ జరగడం లేదు. ప్రపంచంలోని మొత్తం రేర్ ఎర్త్ మెటీరియల్స్‌లో 99 శాతం చైనా నుంచే వస్తున్నాయి, ఈ విషయంలో భారత్ ఇప్పటివరకూ పెద్దగా చేసిందేమీ లేదు" అని నితిన్ గుప్తా అన్నారు."రీసైక్లింగ్ హబ్‌గా మారడం ద్వారా భారత్ తన అవసరాలను తీర్చుకునే దిశగా ముందుకెళ్లొచ్చు. మనం మార్కెట్‌లో పోటాపోటీ ధరకు రీసైకిల్ చేయగలం, కానీ అది భారీ స్థాయిలో జరగాల్సిన అవసరముంది."అయితే, కేవలం రీసైక్లింగ్ ద్వారానే భారత్ అవసరాలు తీరతాయా? అనేదే ఇక్కడి ప్రశ్న. విషయంలో నితిన్ గుప్తా ఆశావహంగానే ఉన్నారు..2025 ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో, భారత్ 9.74 లక్షల టన్నుల డీఏపీ (డైఅమ్మోనియం ఫాస్ఫేట్)ను దిగుమతి చేసుకుంది. గత ఆర్థిక సంవత్సరంలో డీఏపీ మొత్తం దిగుమతులు దాదాపు 45.7 లక్షల టన్నులు. యూరియా దాదాపు 56 లక్షల టన్నులు. ఎరువుల తయారీలో ఇది చాలా కీలకం.దేశీయంగా అవసరమైన ఖనిజాల కొరతతో పాటు అభివృద్ధి చెందిన మైనింగ్, ప్రాసెసింగ్ వ్యవస్థ లేకపోవడం.లిథియం, కోబాల్ట్, మెగ్నీషియం, నికెల్ వంటి ముఖ్యమైన ఖనిజాలకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ ఉంది. అయితే, ఈ కీలకమైన ఖనిజ నిల్వలు భారత్‌లో పరిమితంగానే ఉన్నాయి. లేదంటే నిల్వలు ఉన్నప్పటికీ.. మైనింగ్ సాధ్యమయ్యే పరిస్థితి లేదు.ఆర్థిక వ్యవహారాల విశ్లేషకులు, జర్నలిస్ట్ నరేంద్ర తనేజా మాట్లాడుతూ, "భారతీయ పరిశ్రమలు ముడి చమురు, పెట్రోకెమికల్స్ దిగుమతులపై ఆధారపడి ఉన్నాయి. పెట్రోకెమికల్స్‌పై ఆధారపడని రంగం దాదాపుగా అరుదు. కానీ, ఈ అవసరాలన్నింటికీ భారత్ దాదాపుగా దిగుమతులపైనే ఆధారపడుతోంది. భారత్‌లో ముడిచమురు నిల్వలు లేవని కాదు, కానీ అవి ఉన్నచోట్ల వాటిని వెలికితీయడంలోనూ సవాళ్లున్నాయి" అని అన్నారు.భారత్ దేశీయ రక్షణ రంగ ఉత్పత్తిని ప్రోత్సహించినప్పటికీ, రక్షణ పరమైన అవసరాల కోసం ఇప్పటికీ ఇతర దేశాల దిగుమతులపై ఆధారపడి ఉంది.యుద్ధ విమానాల నుంచి జలాంతర్గాముల వరకు, ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్‌ను కూడా భారత్ విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటోంది.2023 గణాంకాల ప్రకారం, భారత్ తన రక్షణ బడ్జెట్‌లో 36 శాతం దిగుమతులపైనే ఖర్చు చేసింది.జెట్ ఇంజిన్లు, రాడార్ల వంటి హైటెక్ పరికరాలను భారత్ ఇప్పటికీ దిగుమతుల ద్వారానే సమకూర్చుకుంటోంది.ఇంకా, అధునాతన ఆయుధాల కోసం కూడా విదేశాలపై ఆధారపడుతోంది భారత్ దేశీయంగానూ రక్షణ రంగ ఉత్పత్తిని పెంచింది.



# విభజనతో పాటే కాశ్మీర్ చిచ్చు

### నాటి పాలకుల దృష్టి లోపం
### సమర్థ నాయకత్వ లోపంతో సమస్యలు

న్యూఢిల్లీ, : బ్రిటిష్ పాలకలు దేశాన్ని విభజించడమే కాకుండా.. అనేక మెలికలు పెట్టి వెళ్లారు. అలాంటి దాంట్లో కాశ్మీర్ సమస్య ఒకటి. నేటికీ అది రావణకాష్టంగా మారడానికి కారణం వారి కుత్సిత రాజకీయ తంత్రమే. వెళుతూవెళుతూ సంస్థానాలను వారి స్వేచ్ఛకు వదిలేసి వెళ్లారు. ఇదే క్రమంలో భారత్ ఆశ్రయం పొంది భారత్‌లో విలీనం కావడానికి కాశ్మీర్ రాజు హరిసింగ్ చేసిన ప్రయత్నాల ను విభజిత పాక్ అడ్డుకుంది. కొంత భాగాన్ని ఆక్రమించడంతో దిక్కులేని స్థితిలో కాశ్మీర్ రాజు భారత్ ఆశ్రయం పొందాడు. అయితే ఆనాటి ప్రధాని నెహ్రూ తాత్సారం, ఉదాసీనత కారణంగా పాక్ ఆక్రమిత కాశ్మీర్ సమస్య అలాగే ఉండిపోయింది. అలాగే 370 ఆర్టికల్‌తో కొత్తచిచ్చును కూడా నెహ్రూ రాజేశారు. తొలుత కశ్మీర్ రాజు హరిసింగ్ స్వతంత్రంగా ఉంటానని చేసి, పాకిస్థాన్‌తో మమేకం అయ్యేందుకు ప్రయత్నించారు. కానీ వెంటనే తమతో మమేకం కాకపోవడంతో పాకిస్థాన్‌లోని ప్రభుత్వం ఆక్రమిత కశ్మీర్ భాగంలోని గిరిజనులను ఉసిగొలిపితే కశ్మీర్ రాజు హరిసింగ్.. నాటి నెహ్రూ ప్రభుత్వాన్ని శరణు కోరారు. తర్వాత కశ్మీర్ కూడా భారతదేశంలో భూభాగమైనా.. ఆక్రమిత కాశ్మీర్ సమస్యనేటికీ తెగడంలేదు. కాశ్మీర్ రాజు ఒప్పందం మేరకు కాశ్మీర్ యావత్తూ భారత్ భూభాగంగా ఉండాలి. కానీ పాక్ పాలకు తీరు, నాటి భారత్ పాలకుల ముందు చూపు లేకపోవడం కారణంగా నేటికి దానిని రావణ కాష్టంగా మార్చేశాయి. మిలిటెంట్ల చొరబాట్లు, పాక్ సైన్యం అకారణంగా కాల్పులు జరుపడం నిత్యకృత్యంగా మారింది. రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలకు దారి తీసింది. మత ఘర్షణల నివారణకే దేశ విభజన వందేండ్ల పోరాటం తర్వాత భారత్ 1947లో వలస పాలకుల నుంచి విముక్తి పొందింది. బ్రిటన్ పార్లమెంట్ స్థానంలో భారత స్వాతంత్ర్య చట్టం అమలులోకి వచ్చింది. ఆగస్టు 15వ తేదీ నుంచి బ్రిటీషువారి పాలన ముగుస్తుందని ఆ చట్టం నిర్దేశించింది. అలాగే దేశాన్ని రెండు సార్వభౌమ దేశాలైన ఐక్య భారత్, అధినివేశ పాకిస్థాన్‌గా విభజించాలని సూచించింది. రెండు దేశాలకు కేటాయించాల్సిన ప్రాంతాల పర్యవేక్షణకు బ్రిటీషు వారు సర్ సిరిల్ రాడ్‌క్లిఫ్‌ను రంగంలోకి దించారు. వృత్తిరీత్యా న్యాయాధికారి రాడ్‌క్లిఫ్‌ను సరిహద్దు కమిషన్‌కు చైర్మన్‌గా నియమించారు. ఒక దేశాన్ని రెండు స్వతంత్ర దేశాలుగా విడగొట్టే గీత గీయడానికి ఈ కమిషన్‌ను నియమించారు. ఢిల్లీ దేశ విభజన అనంతరం దాదాపు 1.5 కోట్ల మంది తమ నివాస ప్రదేశాలను వదిలి రాడ్‌క్లిఫ్ గీతకు అటూ ఇటూ ప్రయాణిం చారు. వారిలో కొందరు కాలినడకన, మరికొందరు రైళ్లలో, బస్సుల్లో రవాణా వసతి ఏది దొరికితే దానిలో గీత దాటారు. ఈ సందర్భంగా జరిగిన మతోన్మాద మారణకాండలో దాదాపు పదిలక్షల మంది తమ ప్రాణాలు కోల్పోయారు. లక్షల కుటుంబాలు సర్వస్వం కోల్పోయి వీధిన పడ్డాయి. వేల మంది మహిళలపై లైంగిక దాడులు జరిగాయి. దేశవిభజనతో ఒక ప్రాంతం నుంచి మరోప్రాంతానికి తరలివెళుతున్న నిరాశ్రయులైన జనంతో ఢిల్లీ గుడారాల నగరంగా మారిపోయింది. ఇండ్లను, పుట్టి పెరిగిన ప్రాంతాలను వదిలి, మతకల్లోలాల్లో సర్వం పోగొట్టుకొని శరణార్థులుగా మారారు. పాకిస్థాన్ నుంచి భారత్‌కు వలస వచ్చిన హిందువులు, సిక్కులదీ ఇదే పరిస్థితి. అదే సమయంలో ఢిల్లీ జనాభాలో.. వలస వచ్చిన ప్రజల సంఖ్య దాదాపు మూడోవంతు వరకు చేరుకున్న దంటే.. ఏ స్థాయిలో వలసలు జరిగాయో ఊహించుకోవచ్చు. నిట్టనిలువునా చీలిన పంజాబ్ లోనూ ఇదే పరిస్థితి. పలు కాలేజీలు వలస ప్రజల శిబిరాలుగా మారిపోయాయి. కనీస సౌకర్యాలు లేక, ఆహారం లేక జనం అలమటించిపోయారు. ప్రభుత్వం సరఫరా చేసే రేషన్ ఆహారం రోజుకు ఒక చపాతీకి తగ్గించారు. ఆకలితో అల్లాడి వేల మంది మరణించారు. ఇంతటి దారుణం తరవాత కూడా పాక్ భారత్‌తో యుద్ధం చేసి ఓడిపోయింది ఆనాడే ఆక్రమిత కాశ్మీర్ సంగతి తేల్చి వుంటే ఇవాళ ఈ గతి ఉండేది కాదని చరిత్రకారులు అంటారు.

# 'ఎరువు' రాయితీ ఎలా?



- సిఎం ప్రకటనపై సందేహాలెన్నో..
- రైతుల ఆందోళనల వేడి చల్లార్చేందుకేనన్న వాదన
- వైఫల్యాలను కప్పిపుచ్చుకొనేందుకేనన్న విమర్శలు

**అమరావతి,తెలంగాణ దిశ :** యూరియా సహా అన్ని రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించే రైతులకు నగదు ప్రోత్సాహకం అందజేస్తామన్న టిడిపి కూటమి ప్రభుత్వ ప్రకటన చర్చనీయాంశంగా మారింది. ఎరువులకు కేంద్రం విధించిన కోతలు, ఎరువుల సరఫరాలో ప్రభుత్వ వైఫల్యాలపై అన్నదాతల్లో నెలకొన్న ఆగ్రహావేశాలు, అసంతృప్తులను తగ్గించడానికి, ప్రస్తుతం నెలకొన్న వేడిని చల్లార్చడానికే సిఎం ఆ ప్రకటన చేశారని తెలుస్తోంది. రైతు ఎంతైతే ఎరువుల వినియోగాన్ని తగ్గిస్తాడో, ఆ మేరకు బస్తాకు రూ.800 వంతున నగదు బదిలీ చేయనున్నట్లు సోమవారంనాటి కలెక్టర్ల కాన్ఫరెన్స్లో ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. దానికి సంబంధించి త్వరలో విధి, విధానాలు రూపొందించాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. కాగా సిఎం ప్రకటన వెనుక ఎలాంటి నిర్దిష్ట కసరత్తు చేయలేదని, ప్రభుత్వంలో ప్రాథమిక స్థాయిలో కూడా చర్చ జరగలేదని సమాచారం. అందుకే ఏ ఎరువు వాడకాన్ని తగ్గిస్తే రూ.800 ఇస్తారో స్పష్టత కరువైంది. ప్రస్తుతం రాష్ట్రంలో ఫోకస్ అంతా యూరి యాపైనే ఉంది. యూరియా సరఫరాలో ప్రణాళికా రహితంగా ఉన్నారంటూ ప్రభుత్వ వైఫల్యాన్ని సిఎం ఒక మేరకు అంగీకరించారు. యూరియాకే ఎక్కువ సమస్య ఏర్పడింది. కేంద్రం నుంచి అదనుకు యూరియా సరఫరా కానందువల్లనే కొరత వచ్చింది.

పిఎం ప్రణామ్ లో భాగమే: ఎరువుల సబ్సిడీని తగ్గించుకునేందుకు 2023 జూన్లో మోడీ సర్కార్ 'పిఎం–ప్రణామ్' స్కీంకు రూపకల్పన చేసింది. అంతకుముందటి మూడేళ్ల ఎరువుల వినియోగం సగటును గణించి, దానిలో కనీసం పది శాతం వినియోగం తగ్గించాలన్నది లక్ష్యం. ఆ విధంగా ఎంతైతే వినియోగం తగ్గించి సబ్సిడీని ఆదా చేస్తారో, ఆ అమౌంట్ లో సగ భాగాన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు గ్రాంట్గా ఇస్తామంది. దేశ వ్యాప్తంగా ఏడాదికి కేంద్రం ఎరువుల సబ్సిడీ రూ.20 వేల కోట్లు తగ్గించుకోవాలన్నది టార్గెట్. 2023–24, 2024–25, 2025–26.. ఈ మూడేళ్లూ పిఎం ప్రణామ్ అమలులో ఉంటుంది. భవిష్యత్తులో కూడా కొనసాగుతుంది. వీలైన మేరకు ఎరువుల వాడకాన్ని తగ్గించి కేంద్రం నుంచి గ్రాంట్ పొందాలని ఎపి పోటీ పడుతున్నట్లు సమాచారం. ఈ విషయం బయటికి పొక్కేసరికి, కేంద్రం నుంచి వచ్చే గ్రాంట్లో కొంత మొత్తాన్ని రైతులకు నగదు బదిలీ చేస్తామంటే రైతుల్లో ఆందోళన, వ్యతిరేకత తగ్గుతుందని కూటమి సర్కార్ ఎత్తు వేసిందని అనుకుంటున్నారు.

బేస్ లేదు: రైతు ఎంత మేర ఎరువుల వాడకాన్ని తగ్గించాడో నిర్ణయించడానికి డేటా, మెకానిజం ప్రశ్నార్థకంగా మారింది. ఏ ప్రాంతంలో ఏ పంటకు ఎంత ఎరువు ఏ ఎరువు వేయాలన్న వ్యవసాయ వర్సిటీలు, ఐసిఎఆర్ సూచనలను పరిశీలించి, దానికి ఎంత తగ్గించారో డేటా నమోదు చేస్తారని ప్రచారం సాగుతోంది. ప్రస్తుతానికి డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్ఫర్ (డిబిటి) గణాంకాలే సరిగ్గా లేవు. వెబ్ల్యాండ్ ఆధారంగా ఇ–క్రాప్ లింక్ అంటున్నా పంటలు వేశాక ఆ నమోదులు జరుగుతున్నాయి. ఇ–క్రాప్ అనేది ఆచరణసాధ్యం కాదన్నది వాదన. రాష్ట్రంలో కౌలు వ్యవసాయం గణనీయంగా ఉంది. లక్షల ఎకరాలను లక్షలాది కౌలు రైతులు సాగు చేస్తున్నారు. ఇ–క్రాప్లో వారి పేర్లు నమోదు కావు.

వాస్తవ సాగుదారులే ఎరువులు వినియోగిస్తారు. వారందరికీ నగదు ప్రోత్సాహకం ప్రశ్నార్థకం. పిఎం–ప్రణామ్లో యూరియాతో పాటు డిఎపి, ఎంఒపి, ఎస్ఎస్పి, ఎన్పికె (కాంప్లెక్స్) ఎరువులను తగ్గించాలన్నది టార్గెట్. సిఎం చంద్రబాబు యూరియాను దృష్టిలో పెట్టుకొనే బస్తాకు రూ.800 అన్నారన్నది అధికారుల మాట. కేంద్రం యూరియాపై బస్తాకు రూ.1,700 సబ్సిడీ ఇస్తోంది కాబట్టి దానిలో సగం రైతుకు ఇన్సెంటివ్ ఇవ్వాలంటున్నారని తెలిసింది. మరి మిగతా ఎరువుల పరిస్థితేంటన్న ప్రశ్నలొస్తున్నాయి. ఎరువులను తగ్గించే రైతులకు క్యాష్ ఇన్సెంటివ్ అన్న చంద్రబాబు ప్రకటన అటు ప్రభుత్వం, అధికారుల్లో ఇటు రైతుల్లో గందరగోళానికి దారి తీసింది.

# ఆర్థిక బాధ్యత ఇద్దరిదీ...

కుటుంబం ఆర్థికంగా బాగుండాలంటే దంపతులిద్దరూ ఒక్క మాటపై ఉండాలి. డబ్బు విషయంలో ఇద్దరి మనసులో పొదుపు చేయాలని ఉంటే, కచ్చితంగా ఆ కుటుంబానికి ఆర్థిక సమస్యలు రావు. అయితే ప్రణాళికలు ఎలా వేసుకోవాలో చాలామందికి తెలియదు. ముఖ్యంగా కొత్తగా పెండ్లయిన దంపతులకు ఈ విషయంలో అవగాహన అంతంత మాత్రమే! అలాంటి వాళ్లు కొన్ని ఆర్థికపరమైన విషయాలు తెలుసుకుంటే మంచిది. కొత్త దంపతులు పెండ్లికి ముందు తమ ఆర్థిక పరిస్థితులు ఎలా ఉండేవో చర్చించుకోవాలి. అలాగే తమ అప్పులు, ఆస్తులు, పొదుపు చేసిన డబ్బు, అలవాట్లు, ఖర్చుల గురించి ఒకరికొకరు మాట్లాడుకోవాలి.ఇద్దరూ కలిసి డబ్బుపై ఒక అభిప్రాయానికి రావాలి. దాని విలువ గురించి చర్చించుకోవాలి. తర్వాత భవిష్యత్తు కోసం కొన్నిలక్ష్యాలను పెట్టుకోవాలి. అందులో షార్ట్ టర్మ్, లాంగ్ టర్మ్ గోల్స్ ఉండేలా చూసుకోవాలి. చిన్నచిన్న ఔటింగ్స్, కొత్త ఫోన్లు, కంప్యూటర్ల కొనుగోలు, ఎమర్జెన్సీ ఫండ్స్ వాటిని షార్ట్ టర్మ్ గోల్స్‌గా ఫిక్స్ చేసుకోవాలి. సొంతిల్లు, రిటైర్మెంట్ ప్లాన్స్ లాంటివి లాంగ్ టర్మ్ గోల్స్‌గా నిర్దేశించుకోవాలి. అనుకున్న లక్ష్యాలను అందుకునే దిశగా ప్రణాళికలు అమలుచేయాలి. భార్యాభర్తల మధ్య రహస్యాలు ఉండకపోవడం మంచిది. ముఖ్యంగా ఆర్థికపరమైన అంశాల్లో దాచివేతలు, దాటవేతలు భవిష్యత్తులో నమస్యాత్మకంగా పరిణమించే ప్రమాదం ఉంది. అందువల్ల ఆదాయం, పెట్టుబడి, అప్పుల విషయంలో ఇద్దరి మధ్య పారదర్శకత ఉండాలి. అప్పుడే వాళ్లలో నమ్మకం అనే బలమైన పునాది ఏర్పడుతుంది.ఆటుపోట్లు అందరికీ సహజం.





# మెట్రో ప్లాట్ ఫాంల వద్ద స్టీల్ గ్రిల్స్..!

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** హైదరాబాద్ మెట్రో రైల్ కార్పొరేషన్ కీలక నిర్ణయం తీసుకుంది. మెట్రో ప్లాట్‌ఫామ్‌ల వద్ద స్టీల్ గ్రిల్స్ ఏర్పాటు చేయాలని భావిస్తోంది. మెట్రో ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. మొదట కొన్ని ఎంపిక చేసిన మెట్రో స్టేషన్లలో ఈ స్టీల్ గ్రిల్స్ ఏర్పాటు చేసి.. ఆ తర్వాత క్రమంగా అన్ని స్టేషన్లకు విస్తరించాలని చూస్తోంది. రానున్న రెండున్నర ఏళ్లలో హైదరాబాద్‌లోని అన్ని మెట్రో స్టేషన్లలో ఈ స్టీల్ గ్రిల్స్ అందుబాటులోకి రానున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.ప్రయాణికులకు భద్రత కోసం హైదరాబాద్ మెట్రో రైల్ కార్పొరేషన్.. అనేక చర్యలు చేపడుతోంది. నిత్యం ఆఫీసులు, స్కూళ్లు, కాలేజీలు, ఇతర పనుల కోసం మెట్రోలో ప్రయాణించేవారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది.ఈ నేపథ్యంలోనే రద్దీ సమయా ల్లో మెట్రో స్టేషన్లు.. ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి. నిత్యం మెట్రో రైళ్లలో లక్షలాది మంది ప్రయాణిస్తున్నారు.

దీంతో కాలు పెట్టడానికి కూడా వీలు లేకుండా స్టేషన్లు, ప్లాట్‌ఫామ్‌లు నిండిపోతు న్నాయి. దీంతో ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా మెట్రో అధికారులు చూస్తున్నారు

ఇక మెట్రో రైలు వచ్చే సమయంలో ప్లాట్‌ఫామ్‌పైకి వస్తున్న ప్రయాణికుల మధ్య తోపులాటలు చోటు చేసుకుంటుండటంతో.. వారు రైలు పట్టాలపై పడే ప్రమాదం ఉంది. ఇలాంటి ప్రమాదాలు జరగకుండా మెట్రో అధికారులు ముందుగానే అలర్ట్ అవుతున్నారు. మెట్రో ప్లాట్‌ఫామ్‌లపై స్టీల్ గ్రిల్స్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. మెట్రో రైలు డోర్ల వద్ద కాకుండా కోచ్‌ల పొడవునా.. ప్లాట్‌ఫామ్‌పై ఈ ఉక్కు కంచెను ఏర్పాటు చేయనున్నారు.

# వేసవి వ్యాధులు.. తీసుకోవాల్సిన జాగ్రత్తలు



వేసవి ఎండలతో అనేక రుగ్మతలు వ్యాపిస్తుండటం సహజం. డీ హైడ్రేషన్ నుంచి ఫుడ్ పాయిజనింగ్ వరకూ కొన్ని వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. చాలా వ్యాధులు వైరస్‌ల వల్ల వస్తాయి. పరిశుభ్రతకు ఎక్కువ శ్రద్ధ వహించాలి. తరచుగా చేతులు, కాళ్లు కడుక్కోవాలి. ప్రయాణం చేసేటప్పుడు హ్యాండ్ శానిటైజర్ ఉపయోగించటం మర్చిపోవద్దు. శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచుకోవటం చాలా అవసరం. వేసవిలో ఎదురయ్యే ఆరోగ్య సమస్యల వివరాలు ఇవిగో వడదెబ్బ (సన్‌స్ట్రోక్) : ఎండలో ఇష్టానుసారంగా తిరిగినా, నీరు తక్కువగా తీసుకున్నా వడదెబ్బ తగిలే ప్రమాదం ఉంది. శరీర ఉష్ణోగ్రత 104 డిగ్రీల కంటే ఎక్కువగా ఉన్నా, అయోమయం, గుండె వేగంగా కొట్టుకోవడం, శ్వాస తీసుకోవటంలో ఇబ్బంది, చెమట పట్టకపోవటం, కాళ్ళు చేతుల నొప్పులు, శరీరం తిమ్మిరి, వాంతులు, తలనొప్పి, స్పృహకోల్పోవటం వంటివి వడదెబ్బ లక్షణాలు. వడదెబ్బ తగిలిన వ్యక్తి శరీరాన్ని చల్లబర్చాలి. తడిగుడ్డతో శరీరమంతా తుడవాలి. నీళ్లు తాగించి వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లటం ఉత్తమం. ఈ సమస్య రాకుండా ఉండాలంటే తీరు ఎక్కువగా తాగాలి. నిమ్మరసం, కొబ్బరినీరు, గ్లూకోజ్ డి వంటివి తీసుకోవాలి. ఇంట్లో ఎలక్ట్రోరల్ ఫౌడర్ లేదా ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు ఉంచుకోండి. అవి అందుబాటులో లేకపోతే చక్కెర, ఉప్పు కలిపిన నీరు తాగండి. విషాహారం (ఫుడ్‌పాయిజనింగ్): ఆహారం ద్వారా వ్యాపించే వ్యాధులు వేసవిలో సాధారణం. ఇవి ఎక్కువగా హానికారక బ్యాక్టీరియా, పరాన్నజీవుల వల్ల వస్తాయి. అధిక వేడికారణంగా ఆహారం త్వరగా పాడవుతుంది. అలాంటి ఆహారం తీసుకోవటం వల్ల ఫుడ్ పాయిజనింగ్ అయ్యే ప్రమాదం ఉంటుంది. ఆహారం చెడిపోకుండా చూసుకోవాలంటే బాగా ఉడికించాలి. వండిన ఆహారాన్ని బయట వేడిలో ఉంచినప్పుడు బ్యాక్టీరియా పెరుగుతుంది. ఈ సమస్యను అధిగమించేందుకు తాజా ఆహారాన్ని తినటం ముఖ్యం. మసాలాలతో కూడిన ఆహారాన్ని తగ్గించాలి.

కంటి ఇన్ఫెక్షన్ : ఈ కాలంలో కనిపించే కొన్ని సాధారణ కంటి వ్యాధుల్లో కంటి వాపు, అలెర్జీ, కంజక్టివైటిస్ ఉంటాయి. తగినంత విశ్రాంతి కళ్లకు ఇవ్వాలి. వాటిపై ఒత్తిడి తగ్గించాలి. మీ కళ్ళు, ముఖాన్ని క్రమం తప్పకుండా శుభ్రమైన నీటితో కడగాలి. ఎండలో బయటకు వెళ్లే కళ్లజోడు వాడటం మంచిది. సమస్యలు వస్తే డాక్టరు సిఫారసు మేరకు ఐడ్రాప్స్, మందులు వాడాలి.

చర్మ సమస్యలు : సూర్యుని అతినీలలోహిత కిరణాలు వల్ల చర్మంలోని కణాలు దెబ్బతింటాయి. ఎండలో ఎక్కువగా తిరిగితే చర్మం కమిలిపోతుంది. అధిక తేమ, వేడి కారణంగా చర్మంపై ఎరుపు దద్దుర్లు, స్వేద గ్రంథులు మూసుకుపోవటం వంటి సమస్యలు ఉత్పన్నమవుతాయి. చెమట వల్ల మచ్చలు, దురద మంట వస్తుంది. చర్మ సమస్యలు రాకుండా ఉండా లంటే వేసవిలో సన్‌స్క్రీన్ లోషన్లు వంటివి కూడా ఉపయోగించొచ్చు. వాడిన దుస్తులను ఉతక్కుండా మళ్లీ వాడకూడదు. చెమట ఎక్కువగా పడుతున్నం దున స్నానం రెండుమూడు సార్లు చేయొచ్చు. శరీరానికి గాలి తగిలేలా వదులైన, చెమట పీల్చే కాటన్ దుస్తులు ధరించటం మేలు.

అతిసార : ఎండవేడి కారణంగా ఆహారం త్వరగా పాడైపోతుంది. అలాంటి ఆహారం తీసుకుంటే వేసవిలో విరోచనలు సాధారణం. కలుషిత ఆహారం తినటం, నీరు తాగటం, మద్యపాన అలవాట్లు డయేరియాకు దారితీస్తాయి. అతిసారం నుంచి దూరంగా ఉండటానికి నీటిని మరిగించిన తర్వాత మాత్రమే తాగటం అలవాటుగా చేసుకోవాలి. కూరగాయలను ముక్కలుగా చేయటానికి ముందు, తర్వాత వాటిని బాగా కడగాలి. ఇళ్లల్లో ఆహార పదార్థాలపై ఈగలు వాలకుండా చూసుకోవాలి. పాడైనవి కాకుండా వేడి వేడి ఆహార పదార్థాలు తీసుకోవటం మేలు.

చికెన్‌పాక్స్ : చికెన్‌పాక్స్ (అమ్మోరు) చాలా సాధారణ వేసవి వ్యాధుల్లో ఒకటి. ఇది అధిక జ్వరంతో శరీరంపై ఎరుపురంగులో ఉండే చిన్న దద్దుర్ల రూపంలో ప్రారంభమవుతుంది. ఇది పిల్లల్లో తక్కువ రోగ నిరోధకశక్తి ఉన్న వారిలో సాధారణంగా కనిపిస్తుంది. ఇది అంటువ్యాధి. అందువల్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి. ఇది సోకినప్పుడు బయటకు తిరగకుండా ఇంట్లో ఉండటమే మేలు. మంచి మందులు అందుబాటులో ఉన్నాయి. త్వరగా తగ్గే వీలుంది.

తట్టు : మీజిల్స్ మరో సాధారణ వేసవి వ్యాధి. మీజిల్స్‌కు కారణమయ్యే పారామిక్సో వైరస్ వేసవిలో వేగంగా సంతానోత్పత్తి చేస్తుంది. దీని ప్రారంభ లక్షణాలు దగ్గు, అధిక జ్వరం, గొంతునొప్పి, కళ్లు ఎర్రబడటం, తరువాతి దశలో, చిన్న తెల్లటి మచ్చలు ఏర్పడతాయి. మీజిల్స్ దద్దుర్లు శరీరం అంతటా కనిపిస్తాయి. మందులు వాడితే తగ్గిపోతుంది.

కామెర్లు : నీటి ద్వారా సంక్రమించే వ్యాధి. ఇది హైపటైటిస్ ఎ వల్ల వస్తుంది.ప్రధానంగా కలుషిత మైనఆహారం, నీటి వినియోగం వల్ల వస్తుంది.సకాలంలో చికిత్స చేయకపోతే ఈవ్యాధికాలేయం పనితీరును ప్రభావితం చేస్తుంది. ఇది పిత్తం అధిక ఉత్పత్తికి దారితీస్తుంది.

టైఫాయిడ్ : జ్వరం వస్తే సొంత వైద్యంతో నిర్లక్ష్యం చేయొద్దు. జ్వరంతోపాటు తలనొప్పి, నీరసంగా ఎక్కువగా ఉంటే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. అపరిశుభ్ర ఆహారం, నీరు తీసు కోవటం వల్ల ఈ సమస్య వస్తుంది. కలుషిత ఆహారం, నీటి వనరులు బ్యాక్టీరియాకు సంతానోత్పత్తికి ప్రదేశంగా మారతాయి. టైఫాయిడ్ వస్తే బలహీనత, ఆకలిలేకపోవటం, కడుపులో నొప్పి, అధిక జ్వరం వంటి లక్షణాలు కన్పిస్తాయి.

గవదబిళ్లలు : వేసవి వ్యాధుల్లో గవదబిళ్లలు అత్యంత అంటువ్యాధి. ఈ వైరల్ వ్యాధి పిల్లలను ప్రభావితం చేస్తుంది. ఈ అంటువ్యాధి సోకిన వ్యక్తి దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు వ్యాపిస్తుంది. లాలాజల గ్రంథివాపు, కండరాలనొప్పి, జ్వరం, తలనొప్పి, ఆకలి లేకపోవటం, బలహీనత వంటి లక్షణాలు కన్పిస్తాయి.

తలనొప్పి : అధిక ఉష్ణోగ్రతలతో తలనొప్పి ఎక్కువగా కనిపిస్తుంది. వేడి వల్ల వచ్చే తలనొప్పి శరీరం వేడికి ప్రతి స్పందించటం వల్ల కూడా వస్తుంది.

పైన పేర్కొన్న వ్యాధులకు అధునాతనమైన మందులు అందుబాటులో ఉన్నాయి. డాక్టరు సలహా మేరకు వాటిని ఉపయోగిస్తే అవి నియంత్రణలోకి వస్తాయి.

ఈ చిట్కాలు పాటించండి: తరచూ మంచినీరు, నిమ్మకాయ ద్రావణంతోపాటుగా ఎక్కువ మజ్జిగ తీసుకోవాలి. నారింజ, దానిమ్మ వంటి పండ్లను తినాలి. మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల వరకూ బయటకు వెళ్లకండి. క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. సూర్యకాంతికి గురి కావడాన్ని తగ్గించండి. ఉదయం లేదా సాయంత్రం మాత్రమే వ్యాయామం వంటి కార్యక్రమాలను చేయండి. కళ్ల సంరక్షణ కోసం కూలింగ్ గ్లాసులు పెట్టుకోవాలి. లేతరంగు, తేలికైన వదులుగా ఉండే కాటన్ దుస్తులు ధరించాలి. బ్యాక్టీరియాతో ఉండే స్ట్రీట్‌ఫుడ్ తినొద్దు ప్యాకింగ్ చేసిన పండ్లు, కూరగాయలు తీసుకోవద్దు. పండ్లు, కూరగాయల వినియోగాన్ని పెంచండి. ఆల్కాహాల్, కెఫైన్ తీసుకోవద్దు. కూల్‌డ్రింక్స్ తాగొద్దు.



## యాలకులను తిని గోరు వెచ్చని నీళ్లను తాగండి..

### రెండు పూటలా ఇలా చేస్తే ఎంతో మేలు జరుగుతుంది..

యాలకులనిమనం ఎంతో పూర్వకాలంనుంచే వంట ఇంటి మసాలా దినుసుగా ఉపయోగిస్తున్నాం. యాలకులను వేస్తే వంటకాలకు చక్కని రుచి, వాసన వస్తాయి. ఎక్కువగా మసాలా వంటల్లో యాలకులను వేస్తుంటారు. అయితే ఆయుర్వేద ప్రకారం యాలకులు ఎన్నో అద్భుతమైన ఔషధ గుణాలను కలిగి ఉంటాయి. యాలకుల్లో అనేక సమ్మేళనాలు ఉంటాయి.ఇవి మనల్నిఆరోగ్యంగాఉంచుతాయి. రోగాల నుంచి రక్షిస్తాయి. యాలకులను ఆహారంలో భాగం చేసుకుంటే అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. యాలకుల్లో యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. కనుక యాలకులను రోజూ తింటుంటే వాపులు, నొప్పులు తగ్గుతాయి. ముఖ్యంగా ఆర్థరైటిస్ నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది. కీళ్లు, మోకాళ్ల నొప్పులు ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుంది.

**జీర్ణ సమస్యలకు..:** రోజూ భోజనం చేసిన అనంతరం రెండు పూటలా ఒక యాలక్కాయను తిని ఒక గ్లాస్ గోరు వెచ్చని నీళ్లను తాగుతుండాలి. దీంతో జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. జీర్ణ క్రియ సాఫీగా జరుగుతుంది. పొట్టలో గ్యాస్ ఏర్పడదు. కడుపు ఉబ్బరం, అసిడిటీ నుంచి ఉపశమనం లభిస్తుంది. అలాగే మలబద్దకం కూడా తగ్గుతుంది. పేగుల్లో ఉండే వ్యర్థాలు సులభంగా బయటకు పోతాయి. జీర్ణ వ్యవస్థ శుభ్రంగా మారుతుంది. యాలకులను తిని గోరు వెచ్చని నీళ్లను తాగితే గొంతు, ఊపిరితిత్తుల్లో ఉండే కఫం పోతుంది. దగ్గు, జలుబు, ఆస్తమా వంటి శ్వాసకోశ సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. శ్వాస మార్గాల్లో ఉండే అడ్డంకులు పోతాయి. శ్వాస సరిగ్గా ఆడుతుంది.

**గాఢ నిద్రకు..:** యాలకుల్లో ఒత్తిడిని తగ్గించే సమ్మేళనాలు ఉంటాయి. యాలకులను రోజూ తింటే ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. మైండ్ రిలాక్స్ అవుతుంది. మానసిక ప్రశాంతత లభిస్తుంది. రాత్రి పూట చక్కగా నిద్ర పడుతుంది. పడుకున్న వెంటనే గాఢ నిద్రలోకి జారుకుంటారు. నిద్రలేమి నుంచి బయట పడవచ్చు. యాలకుల్లో డై యురెటిక్ గుణాలు ఉంటాయి. అందువల్ల యాలకులను తింటే శరీరంలోని వ్యర్థాలు, టాక్సిన్లు బయటకు పోయి శరీరం అంతర్గతంగా శుభ్రంగా మారుతుంది. శరీరం డిటాక్స్ అవుతుంది. రోగాల నుంచి రక్షణ లభిస్తుంది. యాలకుల్లో యాంటీ మైక్రోబియల్ గుణాలు ఉంటాయి. ఇవి నోట్లో ఉండే బ్యాక్టీరియాను నిర్మూలిస్తాయి. దీంతో నోటి దుర్వాసన తగ్గుతుంది. దంతాలు, చిగుళ్లు దృఢంగా, ఆరోగ్యంగా ఉంటాయి. చిగుళ్ల నుంచి రక్తం కారే సమస్య తగ్గుతుంది.


**క్యాన్సర్ రాకుండా అడ్డుకోవచ్చు..:** యాలకుల్లో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి ఫ్రీ ర్యాడికల్స్ వల్ల మన శరీరానికి కలిగే నష్టాన్ని నివారిస్తాయి. దీంతో కణాలు సురక్షితంగా ఉంటాయి. ఫలితంగా క్యాన్సర్ రాకుండా అడ్డుకోవచ్చు. గుండె పోటు రాకుండా రక్షిస్తాయి. అధిక బరువు ఉన్నవారు రోజూ యాలకులను తిని నీళ్లను సేవిస్తుంటే ఫలితం ఉంటుంది. శరీర మెటబాలిజం పెరుగు తుంది. క్యాలరీలు ఖర్చయి కొవ్వు కరుగుతుంది. బరువు నియంత్రణ లో ఉంటుంది. గుండె ఆరోగ్యానికి యాలకులు ఎంతో మేలు చేస్తాయి. వీటిని రోజూ తింటే రక్త సరఫరా మెరుగు పడుతుంది. ఇది బీపీని తగ్గిస్తుంది. హైబీపీ ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుం ది. ఇలా యాలకులను తినడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు. రోజూ ఉదయం, సాయంత్రం తింటే ఎక్కువ ఫలితం ఉంటుంది.

# భయం నుంచే కోపం!

కోపం, క్రోధం, ఆగ్రహం.. భయం-అన్నీ ఒక్కటే. కోపం తాటాకు మంటలా క్షణికం అయితే, క్రోధం చింతనిప్పులా తీవ్రతరం.. దీర్ఘకాలికం అని చెబుతారు. మనిషన్న తర్వాత కోపం సహజం. కానీ, అది క్రోధంగా మారకూడదు. ఈ క్రోధం ఎదుటివారిని ఎంతవరకూ కాలుస్తుందో తెలియదు కానీ, తనను మాత్రం తక్షణం కాలుస్తుంది. విచక్షణ కోల్పోయేలా చేస్తుంది. ఓ సింహం తన కంటబడిన కోతిని వెంటాడుతుంది. అది ప్రాణ భీతితో ఎత్తైన చెట్టు ఎక్కింది. కోతి తప్పించుకుందన్న అక్కసు, ఆక్రోశంతో ఊగిపోయిన సింహం%ౌ%పట్టలేని క్రోధంతో ఆ చెట్టును కూల్చేస్తుంది. అది కాస్తా తనమీదే పడటంతో.. ఆ చెట్టుకింద పడి సింహం చచ్చిపోతుంది. అందుకే 'తన కోపమే తన శత్రువు' అంటారు. 'విచక్షణా జ్యోతి.. కోపమనే సుడిగాలికి కొండెక్కుతుంది' అన్న అమెరికన్ తత్వవేత్త రాబర్ట్ ఇంగర్ సాల్ మాట అక్షర సత్యం. ఎర్రగా కాలిన నిప్పు కణికలను ఎవరిపైనైనా విసరాలనుకుంటే.. ముందు మన చెయ్యి కాలుతుందన్న విషయం మర్చిపోకూడదు. కోపం భయం మధ్య సంబంధం చాలా సంక్లిష్టమైనది.. సహజమైనది. అది లింగవివక్షను వదిలిపెట్టలేదు. తత్వవేత్త మార్తా నస్బామ్ 'యాంగర్ అండ్ ఫర్గివ్‌నెస్'లో రాసినట్టుగా.. 'మగ' అనే లేబుల్ వేయబడిన శిశువు ఏడుపు సాధారణంగా కోపంగా వున్నట్లు అర్థం చేసుకుంటారు. కానీ ఏడుస్తున్న ఆడపిల్ల 'భయం'తో ఏడుస్తున్నట్లుగా పరిగణించబడుతుంది. ఇక్కడ ఏడుస్తున్న చర్య ఒక్కటే. వివరణ మాత్రం లింగపరమైనది. కోపంగా వున్న స్త్రీ ఉన్మాదంగా వుంటుంది. ఆమెలో ఏదో తప్పు వుంది. అదే కోపంగా వున్న పురుషుడు వీరుడు. ఈ వివక్ష సమాజ దృక్కోణంలోనే కాదు, కోపం వ్యక్తీకరణలోనూ వేళ్లూనుకుంది.

కోపం, పగ, ద్వేషం..వంటి వాటిని బలమైన అంశాలుగా సినిమాల్లో, కథలు, పురాణాల్లో చూస్తాం. అన్యాయాన్ని సరిచేయడం, న్యాయాన్ని పరిరక్షించడం ఒక భాగం. అయితే, పగ తీర్చుకోవడం అనేది ధైర్యానికి సూచిక అనుకుంటారుగానీ, వాస్తవానికది భయానికి ప్రతీక. తన సోదరికి జరిగిన అవమానానికి ప్రతీకారం తీర్చుకోవాలన్న రావణుడి ప్రయత్నం లంక నాశనానికి కారణమైంది. 'ప్రతి మనిషిలోనూ 160 రకాల భయాలుంటాయి' అంటాడు మనస్తత్వ శాస్త్ర పితామహుడు సిగ్మండ్ ఫ్రాయిడ్. ఏదోక విషయంలో అతిగా భయపడేవాళ్లే ఎక్కువ కోప్పడతారన్నది నిరూపితమైన అంశం. ఔరంగజేబు అప్పుడప్పుడో ఏదో చేశాడని, ఇప్పుడు పగ తీర్చుకోవాలనుకోవడం, ఆతని సమాధి తవ్వేయాలనుకోవడం అంటే%ౌ% భయం వల్ల కాక మరేమిటి? దేశ జనాభాలో మైనారిటీగా వున్న ముస్లిం, మైనారిటీల పట్ల అంత భయం ఎందుకు? చేతగానితనాన్ని, అసమర్థతను కప్పిపుచ్చుకోడానికి ప్రజల దృష్టి మళ్లించడానికి భయంతో చేస్తున్న ఎదురుదాడి తప్ప మరోటి కాదు.

నెల్సన్ మండేలా తన జీవితమంతా నిర్బంధంలోనే గడిపారు. ఆయన బయటికి వచ్చిన తర్వాత దీనికి కారణమైన వారిపై తప్పుడు కేసులు పెట్టి, పగ తీర్చుకునే ప్రయత్నం చేయలేదు. దానికి ప్రత్యామ్నాయంగా ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడం, దాని బలోపేతం చేయడంపై దృష్టి పెట్టారు. అందువల్లే ఆయన ప్రపంచ ప్రఖ్యాతి పొందారు. నోబెల్ శాంతి పురస్కారం అందుకున్నారు. గాంధీ హిందూ మతానికి ఏదో ద్రోహం చేశాడన్న పేరుతో గాడ్సే ఆయన్ని కాల్చి చంపాడు. నిజానికి మత ఘర్షణల చిచ్చు నుంచి భారతదేశాన్ని కాపాడినందుకు ఆయనంటే వాళ్లకి భయం. కోపం, పగ, ద్వేషం నుంచి మానవత్వ విలువలు పెరగవు. కోపం మానవత్వాన్ని హరిస్తుంది. విచక్షణ మందగిస్తుంది. అప్పుడిక మనిషి పశుప్రాయుడే. ఇదొక ఆటవిక లక్షణం మాత్రమే. ఈ తరహా జంతు లక్షణాలను గొప్పగా చిత్రీకరించుకొని సినిమాల్లోనే కాకుండా జీవితంలో కూడా ఆ కోపం ప్రదర్శించకపోతే నువ్వేదో చేతగాని వాడనుకుంటారేమోనన్న భయం. 'కోపం యొక్క గుండె తరచుగా ప్రతీకారాన్ని కోరుకుంటుంది' అంటారు నస్బామ్. ఈ మానవ బలహీనతను తమ రాజకీయ ప్రయోజనాలకు రెచ్చగొట్టి వాడుకోజూసే వారిలో మానవత్వం వుంటుందా? వారిని నాగరికులుగా పరిగణించగలమా?



## మామిడి బొప్పాయి సలాడ్



కావలసిన పదార్థాలు సన్నగా తరిగిన మామిడి పండు, బొప్పాయి పండు ముక్కలు : ఒక కప్పు చొప్పున, పచ్చిమిర్చి : రెండు, కొత్తిమీర తురుము: ఒక టీస్పూన్, వేయించిన పల్లీలు : పావు కప్పు, ఉప్పు : తగినంత, ఆలివ్ ఆయిల్ : రెండు టీస్పూన్లు, మిరియాల పొడి : పావు టీస్పూన్, వెల్లుల్లి రెబ్బలు : నాలుగు, తెల్ల నువ్వులు : రెండు టీస్పూన్లు. తయారీ విధానం ఒక గిన్నెలో మామిడి, బొప్పాయి ముక్కల్ని వేసి, చిన్నగా తరిగిన పచ్చిమిర్చి ముక్కలు, కొత్తిమీర తురుము, వేయించిన పల్లీలు, తగినంత ఉప్పు, ఆలివ్ ఆయిల్, మిరియాల పొడి, తురిమిన వెల్లుల్లి వేసి బాగా కలపాలి.

## రోజూ గుప్పెడు నట్స్‌ను తింటే ఇన్ని ఉపయోగాలు ఉన్నాయా..?

### ఇవి తెలిస్తే వెంటనే తినడం మొదలు పెడతారు..!

బాదంపప్పు, జీడిపప్పు, పిస్తా, వాల్ నట్స్. ఇలా మనకు తినేందుకు అనేక రకాల నట్స్ అందుబాటులో ఉన్నాయి. కానీ ధర ఎక్కువ ఉంటుందని, లేదా మరేదైనా ఇతర కారణాల వల్ల ఈ గింజలను చాలా మంది తినడం లేదు. కానీ వాస్తవానికి ఈ గింజలను తింటే మనకు ఎన్నో లాభాలు కలుగుతాయి. వీటన్నింటినీ కలిపి రోజుకు గుప్పెడు మోతాదులో రాత్రి పూట నీటిలో నానబెట్టాలి. మరుసటి రోజు ఉదయం తినాలి. ఇలా ఈ గింజలను తినడం వల్ల మనకు ఎన్నో లాభాలు కలుగుతాయి. నట్స్ మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వీటిల్లో యాంటీ ఆక్సిడెంట్లతోపాటు విటమిన్లు, మినరల్స్ అధికంగా ఉంటాయి. ముఖ్యంగా బాదం, జీడిపప్పు, పిస్తా, వాల్ నట్స్, పల్లీలు వంటి గింజల్లో ఫ్యాటీ యాసిడ్లు ఉంటాయి. ఇవి గుండెను ఆరోగ్యంగా ఉంచుతాయి.

గుండె ఆరోగ్యానికి..: చేపలను తినడం వల్ల లభించే ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు ఈ గింజల్లోనూ ఉంటాయి. అందువల్ల చేపలను తినలేని వారికి ఈ గింజలు మంచి ఆహారం అని చెప్పవచ్చు. ఈ గింజల్లో కొలెస్ట్రాల్ ఉండదు. కానీ వీటిల్లో కొలెస్ట్రాల్ ఉంటుందని, అది గుండెకు హాని చేస్తుందని అనుకుంటారు. అందులో ఎంత మాత్రం నిజం లేదని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. అలాగే ఈ నట్స్‌ను మోతాదులో తింటేనే అనేక ప్రయోజనాలు కలుగుతాయి. దేన్నీ అతిగా తినరాదు అనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. ఈ నట్స్‌ను ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల శరీరంలో ఉండే ఎల్‌డీఎల్ (చెడు కొలెస్ట్రాల్) తగ్గుతుంది. హెచ్‌డీఎల్ (మంచి కొలెస్ట్రాల్) పెరుగుతుంది. దీని వల్ల గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా సురక్షితంగా ఉండవచ్చు.

జీర్ణ సమస్యలకు..: నట్స్‌లో ఉండే ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు రక్తనాళాలను ఆరోగ్యంగా ఉంచుతాయి. దీంతో రక్త నాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోతాయి. దీని వల్ల హార్ట్ ఎటాక్ రాకుండా ఉంటుంది. నట్స్‌లో ఉండే పీచు బరువు తగ్గడానికి సహాయం చేస్తుంది. ఈ నట్స్‌ను తింటే ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. కడుపు నిండిన భావనతో ఉంటారు. దీంతో జంక్ ఫుడ్ జోలికి వెళ్లరు. ఇది బరువు తగ్గేందుకు సహాయం చేస్తుంది. నట్స్‌ను తినడం వల్ల జీర్ణ క్రియ మెరుగు పడుతుంది. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. వీటిల్లో ఉండే ఫైబర్ గ్యాస్, అసిడిటీ, మలబద్దకం, అజీర్తి వంటి సమస్యలను తగ్గిస్తుంది. నట్స్‌ను ఆహారంలో భాగం చేసుకుంటే డయాబెటిస్ వచ్చే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయని సైంటిస్టుల అధ్యయనాల్లో తేలింది.

విటమిన్ ఇ అధికం..: నట్స్‌లో విటమిన్ ఇ సమృద్ధిగా ఉంటుంది. ఇది రక్త నాళాల్లో కొవ్వు చేరకుండా చూస్తుంది. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. గుండె పోటు రాదు. పక్షవాతం వంటి జబ్బులు రాకుండా నివారిస్తుంది. నట్స్‌లో వృక్ష సంబంధ స్టెరాల్స్ అనే సమ్మేళనాలు ఉంటాయి. ఇవి కొలెస్ట్రాల్ తగ్గేందుకు దోహదం చేస్తాయి. గింజల్లో ఉండే ఎల్-ఆర్జినైన్ అనే సమ్మేళనం రక్త నాళాలను సాగేలా చేస్తుంది. దీంతో రక్త నాళాలు గట్టి పడకుండా ఉంటాయి. ఇది గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఈ విధంగా పలు



నట్స్‌ను ఆహారంలో భాగం చేసుకుంటే అనేక ప్రయోజనాలను పొందవచ్చు. అయితే అన్ని నట్స్‌ను తినకపోతే ఏదైనా ఒక రకానికి చెందిన నట్స్‌ను అయినా రోజూ గుప్పెడు మోతాదులో తినే ప్రయత్నం చేయాలి. దీంతో అనేక ప్రయోజనాలను పొందవచ్చు.

# ఖాదీ పరిశ్రమను కాపాడరా...?

"మేక్ ఇన్ ఇండియా-మేడ్ ఇన్ ఇండియా, విదేశీ వద్దు-స్వదేశీ ముద్దు" ఇదీ ప్రధాన మంత్రి నరేంద్రమోదీ స్లోగన్. బహిరంగ సభలు, మన్‌కీ బాత్ లాంటి వేదికలపై ఉత్సాహంగా, ఆకట్టుకునేలా ప్రసంగిస్తారు. మన ప్రధాని మాటలకు అర్థలు వేరులే. అన్నట్లుగా ఆచరణలో కనబడుతుంటుంది. ఇందుకు తెలంగాణలోని ఖాదీ వస్త్ర పరిశ్రమనే ఉదాహరణ. స్వాతంత్రానికి ముందు, ఆ తరువాత 2014 వరకు ఆదరణ లభించిన ఖాదీ పరిశ్రమ..నేడు మూసివేత దిశలో కొట్టుమిట్టాడుతోంది. చాలాచోట్ల వస్త్ర పరిశ్రమలకు కేంద్ర ప్రభుత్వం నుండి ఆదరణ, ప్రోత్సాహకాలు లేక ఉత్పత్తులు సాగించలేని దుస్థితికి నెట్టవేయబడ్డాయి. స్వాతంత్రోద్యమ స్ఫూర్తితో 1919లో బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా ఏర్పడ్డ ఖాదీ వస్త్ర పరిశ్రమకు 1948 వరకు మహాత్మా గాంధీ ప్రాతినిధ్యం వహించారు. ఆ తరువాత మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు ఖాదీ పరిశ్రమకు అధ్యక్షులుగా ఉన్నారు. దేశ వ్యాప్తంగా ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ కమీషన్ (కేవీఐసీ), ఖాదీ బోర్డులు ఏర్పాడ్డాయి. వస్త్ర ఉత్పత్తితో గ్రామాల్లో ప్రారంభమైన కుటీర పరిశ్రమ ఇతర రంగాలకు విస్తరించింది. ఖాదీ కమీషన్ కిందనే సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఏర్పాడ్డాయి. వాటికి నలభైశాతం రాయితీలను కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే.. బడా కార్పోరేట్, విదేశీ వస్త్ర పరిశ్రమలు ఏర్పాడ్డాక..చిన్న, మధ్య తరహా కుటీర వస్త్ర పరిశ్రమ కుదేలైంది. ఇందులో మొదటి వేటు ఖాదీ పరిశ్రమపైనే పడింది. నాణ్యమైన పత్తి నుండి దారంగా (చేతి ద్వారా స్పిన్నింగ్), ఆ తరువాత మగ్గం ద్వారా ఖద్దరు వస్త్రాన్ని ఉత్పత్తి చేసి ఆయా ప్రాంతాల్లో అమ్మకాలు సాగించే వావిలాల, మెట్‌పల్లి ఖాదీ సంస్థలు..కార్పోరేట్ పరిశ్రమలతో పోటీ పడలేక, కేంద్ర ప్రభుత్వం నుండి ప్రోత్సాహం లేక మూసివేత దశకు చేరుకున్నాయి. కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం వావిలాలలోని ఖాదీ పరిశ్రమకు దేశ వ్యాప్త చరిత్ర ఉంది. ఈ ఖాదీ సంస్థకు మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు, మాజీ ఎంపీలు కెప్టెన్ లక్ష్మీకాంతారావు, వొడితెల రాజేశ్వర్ రావు, మాజీ ఎమ్మెల్యే జనార్దన్ రెడ్డి అధ్యక్షులుగా వ్యవహరించారు. ప్రస్తుతం ఎమ్మెల్సీ, పీవీ కూతురు వాణీదేవి ఛైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తున్నారు. గతంలో ఇక్కడ ఉత్పత్తి అయిన జాతీయ జెండా ఎర్రకోటపై రెపరెపలాడేది. ఇక్కడి ఖద్దరు వస్త్రాలు ఇరత రాష్ట్రాల్లో ప్రాచుర్యం పొందేవి. గతంలో వేల సంఖ్యలో ఉన్న కార్మికులు..ఇప్పుడు కనీసం యాభై మంది కూడా పని చేయని పరిస్థితి నెలకొంది. దీంతో ప్రస్తుతం ఈ ఖాదీ పరిశ్రమ మూసివేత దశలో ఉంది. రెండేండ్లుగా కేంద్ర ప్రభుత్వం నుండి రావాల్సిన మార్కెటింగ్ డెవలాప్‌మెంట్ అసిస్టెన్స్ (ఎండీఏ) ఇతర నిధులు రావడం లేదని ఇక్కడి కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మెట్‌పల్లి ఖాదీ పరిశ్రమ కూడా బారీష్టాలు ఎదుర్కొంటుంది.



# ఆర్థిక సర్వే అంచనాలను వాస్తవ వృద్ధి అధిగమిస్తోంది!



మనదేశ ఆర్థిక వృద్ధి గణాంకాలను పరిశీలిస్తే, ఆర్థిక సర్వేలో ప్రకటించిన అంచనాలను తరచుగా అధిగమిస్తున్నాయి. బడ్జెట్ ముందస్తు పత్రం (ప్రీ-బడ్జెట్ డాక్యుమెంట్)లో అంచనా వేసిన 6.3-6.8% వృద్ధికి మించి 2025-26 ఆర్థిక సంవత్సరంలో 7.4% వృద్ధిరేటు నమోదవుతుందని అంచనా. 2023-24 ఆర్థిక సర్వేలో జీడీపీ వృద్ధి 6-6.8 శాతమని అంచనా వేయగా, అది 9.2 శాతంగా నమోదైంది. 2024-25లో మాత్రం ఆర్థిక సర్వే అంచనా 6.5-7 శాతానికి అనుగుణంగా, 6.5 శాతంగా నమోదైంది. 2022-23లో లక్ష్యం నెరవేరలేదు.

వాస్తవిక ఆర్థిక వృద్ధి 7.65% ఉండగా, ఆర్థిక సర్వే అంచనా 8-8.5 శాతంగా ఉంది. 2021-22లో కొవిడ్ కారణంగా ఆర్థిక సర్వే ఎలాంటి అంచనాలను వేయలేదు. కానీ బేస్ ప్రభావం కారణంగా 9.7% వృద్ధి నమోదైంది. 2020-21లో కొవిడ్ ప్రభావం, తదనంతర లాక్‌డౌన్‌ల కారణంగా 5.8% ప్రతికూల వృద్ధి నమోదైంది. ఫిబ్రవరి 1న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుండగా, దీనికి ఒకరోజు ముందు ఆర్థిక సర్వేను వెల్లడిస్తారు.

## ఆల్ టైం కనిష్టానికి ఇరాన్ కరెన్సీ.. డాలరుకు 15 లక్షల రియాల్స్




ఇరాన్ కరెన్సీ అయిన ఇరానియన్ రియాల్ మళ్లీ భారీగా పడిపోయింది. ఓపెన్ మార్కెట్‌లో ఒక అమెరికన్ డాలర్‌కు ఆల్ టైమ్ కనిష్టంగా సుమారు 14.7 లక్షల నుంచి 15 లక్షల రియాల్స్ వరకు డౌన్ అయింది. ఇది ఇరాన్ చరిత్రలోనే అత్యల్ప స్థాయి కావడం గమనార్హం. 2025 చివరితో పోలిస్తే రియాల్ విలువ దాదాపు 20 నుంచి 30 శాతం వరకు పడిపోయింది. అయితే ఇరాన్ సెంట్రల్ బ్యాంక్ ప్రకటించే అధికారిక రేటు సుమారు 42 వేల రియాల్స్‌గా ఉన్నప్పటికీ, ఆ రేటును సాధారణంగా ఎవరూ ఉపయోగించరు.

దేశంలో వాస్తవంగా జరిగే లావాదేవీలు అన్నీ ఓపెన్ మార్కెట్ రేటు ప్రకారమే జరుగుతున్నాయి. ఇరాన్ కరెన్సీ పతనానికి అనేక కారణాలు ఉన్నాయి. ముఖ్యంగా అమెరికా సహా పశ్చిమ దేశాల ఆర్థిక ఆంక్షల వల్ల ఇరాన్‌కు చమురు ఎగుమతులు తగ్గాయి. విదేశీ కరెన్సీ దేశంలోకి రావడం బాగా తగ్గిపోయింది. మరోవైపు దేశంలో ద్రవ్యోల్బణం తీవ్రంగా పెరిగింది. 2025 డిసెంబర్ నాటికి ఇన్‌ఫ్లేషన్ 40 శాతానికి పైగా ఉండగా, ఆహార పదార్థాల ధరలు 70 శాతం కంటే ఎక్కువగా పెరిగాయి. ధరల పెరుగుదలతో ప్రజలు ఆందోళనకు గురై దేశవ్యాప్తంగా నిరసనలు కూడా చేశారు. ప్రభుత్వం తీసుకున్న కొన్ని ఆర్థిక నిర్ణయాలు, సబ్సిడీల తగ్గింపు, ఫారెక్స్ నియమాల్లో మార్పులు కూడా పరిస్థితిని మరింత దిగజారేలా మార్చాయి. ఇది సాధారణ ప్రజలపై తీవ్ర ప్రభావం చూపుతోంది.

ఒక డాలర్‌కు 15 లక్షల రియాల్స్ అంటే దిగుమతి చేసుకునే ఆహారం, మందులు, టెక్నాలజీ వస్తువుల ధరలు భారీగా పెరిగిపోయినట్టేనని నిపుణులు చెబుతున్నారు. బ్రెడ్, మాంసం, ఔషధాలు వంటి అవసరమైన వస్తువులు కూడా సామాన్యులకు అందని స్థితికి చేరుతున్నాయి. ఇరాన్ ఇప్పుడు హైపర్ ఇన్‌ఫ్లేషన్ దశకు చేరిందని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. అందుకే ప్రజలు తమ డబ్బు విలువ కాపాడుకోవడానికి డాలర్లు, బంగారం, క్రిప్టో కరెన్సీల్లో పెట్టుబడి పెడుతున్నారు. ప్రభుత్వం, సెంట్రల్ బ్యాంక్ మాత్రం దీనిని సహజ ప్రక్రియగా చెబుతున్నా, ఆర్థిక నిపుణులు ఇది తీవ్రమైన ఆర్థిక సంక్షోభమని, రాబోయే రోజుల్లో మరిన్ని నిరసనలకు దారితీసే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. మరోవైపు ఇరాన్ రియాల్ ప్రపంచంలోనే అతి తక్కువ విలువ గల కరెన్సీల జాబితాలో ఒకటిగా చేరింది.


# ఇండిగో గుత్తాధిపత్యంపై మళ్లీ ప్రశ్నలు

ఇటీవల ఇండిగో విమానాల సంఘటన భారతదేశంలో ప్రపంచీకరణ, పెట్టుబడిదారీ వర్గం పాలక వ్యవస్థల పనితీరుపై అనేక ప్రశ్నలను మరోసారి లేవనెత్తింది. గత దశాబ్దాలలో ప్రయాణీకులు ఇలాంటి అస్తవ్యస్తమైన పరిస్థితిని ఎప్పుడూ ఎదుర్కోలేదు. లగేజీ కౌంటర్లలో లగేజీని అప్పగించిన తర్వాత కూడా ఫ్లైట్లు రద్దు కావడం, ఆపై ప్రయాణీకులకు తమ లగేజీ దొరక్కపోవడం లాంటి సంఘటనలు ప్రజలకు నోట్ల రద్దు నాటి అస్తవ్యస్తతను మరోసారి గుర్తు చేశాయి. ఎక్కడి వారు అక్కడే గప్చుప్ అయ్యే పరిస్థితి దాపురించింది. ఇది కేవలం ఒక్క విమాన సంస్థ వైఫల్యం అని గానీ, ప్రస్తుత పాలకవర్గం గత విధానాలపై నింద వేసి తప్పించుకు నేంత తేలికైన సమస్య కాదు. ఒక్క నవంబర్లోనే దాదాపు 900 కంటే ఎక్కువ విమానాలను ఇండిగో రద్దు చేసింది. ఆ తర్వాత డిసెంబర్ 6న 1600 ఫ్లైట్లు, డిసెంబర్ 7న 850 ఫ్లైట్లను రద్దు చేయడం చూస్తే, ఇంతటి అధిక స్థాయిలో సర్వీస్ లోపాలు, నియంత్రణలో వైఫల్యాలు భారత ప్రజలు గతంలో ఎప్పుడూ విన్నది లేదు. సాధారణ ప్రజలు, మధ్యతరగతి ఇప్పటికే భారతీయ రైల్వేలపై ఆశలు వదులుకున్నారు. గత బాలసోర్ రైలు సంఘటన గాయం ఇంకా ప్రజల జ్ఞాపకాల నుండి చెరిగి పోలేదు. రైల్వే సేవలలో నాణ్యతా ప్రమాణాలు అత్యంత దిగువ స్థాయిలో ఉన్నాయనేది ప్రయాణీకులందరికీ అనుభ వమే. ఒక్కొక్క సేవను కార్పొరేట్ కాంట్రాక్టుల గుప్పెట్లో పెట్టిన తర్వాత రైల్వే సేవలు మరింత దారుణంగా మారి పోయాయి. రైలు బోగీల్లో కంపుకొట్టే దుర్గంధాన్ని భరించక తప్పని పరిస్థితి. దానికి తోడు గంటల కొద్దీ రైళ్ల ఆలస్యం వర్ణనాతీతం. తక్కువ జీతాలు తెచ్చుకునే కార్మికులకు రైల్వే తప్ప మరో మార్గం లేదు.. ఈ విపత్కర సంధి దశలో మధ్యతరగతి ప్రజలు, కాస్త ఎక్కువ డబ్బులు ఇచ్చి అయినా సరే, విమాన సేవల్ని కొనుగోలు చేయాలని ఆశించారు. ఒకప్పుడు ధనిక వర్గానికి మాత్రమే పరిమితమైన విమాన ప్రయాణాన్ని, ఇండిగో వంటి కంపెనీలు చవకగా అందించడంతో, రైల్వేలపై అసంతృప్తితో ఉన్న మధ్యతరగతి వర్గం విమానాలపై ఆధారపడటం మొదలుపెట్టింది. సరిగ్గా ఇదే సమయంలో, ఇలాంటి వర్గంతో భారతదేశంలో వ్యాపారం చేసి భారీ లాభాలను ఆర్జించవచ్చని భావించిన ఇండిగోకు మార్గం సుగమం అయింది. ఈ రెండు అంశాలు కలసి ఇండిగోకు గోల్డెన్ ఏజ్ను అందించాయి.. 1990లో ప్రారంభమైన ప్రపంచీకరణతో, పాలకవర్గాలు దేశ ఆర్థిక విధానాలను పెట్టుబడిదారీ వర్గానికి అనుకూలంగా మార్చడం మొదలుపెట్టాయి. ఇటీవల అది వేగం అందుకుంది. ఇటీవల ఎల్ఐసీ తన నిధుల్ని భారీగా ఒక ప్రత్యేక కంపెనీ బాండ్ల కొనుగోలులో వినియోగించిందనే చర్చ కొనసాగుతుంది. అయితే ఎల్ఐసీ ఆ విమర్శను తిప్పి కొట్టినప్పటికీ, ప్రజల మెదళ్లలో సందేహాలు లేకపోలేదు. జియో ఉచిత సేవలతో టెలిఫోన్ రంగం ఒకటి రెండు సంస్థల చేతుల్లోకి వెళ్లినట్టుగానే, 'పెద్ద చేప చిన్న చేపను తినేసే' గుత్తాధిపత్యం ప్రతి రంగంలోనూ మొదలైంది. చివరకు లేబర్ కోడ్లలో మార్పులతో మొత్తం పారిశ్రామిక వాతావరణం కూడా పెట్టుబడిదారీ వర్గానికి అనుకూలంగా మారబోతోంది. శ్రమ దోపిడీ ఏ స్థాయిలో కొనసాగించినా సరే, శ్రామికుడిని 12 గంటలు పని స్థలాల్లో పనిచేయించినా సరే సమ్మెలను అంగీకరించేది లేదనే పరిస్థితి మెల్లమెల్లగా శిలాశాసనం కాబోతుందా? తక్కువ జీతాలు తెచ్చుకునే కార్మికులకు రైల్వే తప్ప మరో మార్గం లేదు.. ఈ విపత్కర సంధి దశలో మధ్యతరగతి ప్రజలు, కాస్త ఎక్కువ డబ్బులు ఇచ్చి అయినా సరే, విమాన సేవల్ని కొనుగోలు చేయాలని ఆశించారు.

# కొత్త ఒరవడులు - అల్లం రచనలు


సాధారణంగా కథల పాఠకులు కొత్తదనం కోరుకుంటారు. ఇది గ్రహించే కథా రచయితలు పాఠకులను తమ కథల పట్ల ఆసక్తిని పెంపొందించే కథా వస్తువులను ఎంచుకునే ప్రయత్నం చెయ్యడం కద్దు. దీనిని పూర్తిగా అర్థం చేసుకుని తెలుగు కథా రచనలో కొత్త ఒరవడిని సృష్టించాడు అల్లం శేషగిరిరావు. ఎన్నో కథలు వచ్చాయి కాని తెలుగులో వేట గురించి కథలు అల్లం శేషగిరిరావు రాసేవరకూ రానేలేదని చెప్పవచ్చు. అడవిలోని క్రూర మృగాల ప్రాకృతిక ధర్మాలను కథా వస్తువుగా తీసుకున్నా , మానవ మానసిక స్థితిని నిగూఢంగా సూచించడమే ఆయన రచనా లక్ష్యంగా ప్రస్ఫుటం అవుతుంది. మామూలుగా కాక, అయన కథలను విశ్లేషణా పరంగా ఆలోచనకు భూమిక చేశాడు. అల్లం శేషగిరిరావు (డిసెంబర్ 9, 1934 - జనవరి 3, 2000) ప్రముఖ తెలుగు కథా రచయిత. 1934, డిసెంబర్ 9 న ఒడిశా (నాటి ఒడిషా) లోని గంజాం జిల్లాలో జన్మించాడు. శేషగిరి రావు కథలు తమాషాకు రాసిన కథలు కావు. జీవితం గురించి రచయిత తీవ్ర ఆలోచన, లోతుగా పరిశీలన, జీవితంలో అన్యాయాల గురించి ఆందోళన, వేటకథల నేపథ్యంగా అర్థం చేసుకోవచ్చు. వేటాడడం, అడవి మృగాల స్వభావం, సహజ లక్షణం. ప్రాకృతిక ధర్మం కూడా. సంస్కార వంతుడైన మనిషి మృగంలా మారి బలహీనుణ్ని పీక్కుతినే అరాచ కత్వం, బడుగుల మూలుగులను పీల్చేసే బలాధిక్యతల గురించి నిక్కచ్చిగా, నిజాయతీగా మాట్లాడే కథలు తెలుగులో తక్కువ కనిపిస్తాయి. అలాంటి అరుదైన కథలను పాఠకులకు అందించి, ఆలోచింప చేసిన రచయిత అల్లం శేషగిరిరావు. ఆయన తెలుగు హెమింగ్వే గా లబ్ధ ప్రతిష్టులు. తరాలు మారినా, కాలంలో మార్పు వచ్చినా, అలనాటి నుండి సామాజిక పరిస్థితులలో ఆశించిన మార్పు రానేలేదు. బలవంతుడు, బలహీనునిపై, నిస్సహాయతలపై ఆధిపత్యం కొనసాగుతూనే ఉంది. నాగరిక ముసుగులో దాగిన ఈ అమానవీయతను ఉన్నది ఉన్న ట్టుగా చూపెడతాయి శేషగిరిరావు కథలు. ఇవి మనిషిలోని జంతు ప్రవృత్తిని తేటతెల్లం చేస్తాయి. ఎవరూ చూడని కొత్తకోణాన్ని దర్శించేందుకు వీలు కల్పిస్తాయి. కొత్త ఎత్తుగడ, ఉత్కంఠ, ఆసక్తికర ముగింపూ, అటవీ సంబంధ విశేషాలూ, జంతువుల సహజ ప్రవర్తనాస్థితి.. ఇలాంటి అంశాలతో ఈ కథలు పాఠకులను ఆగకుండా చదివింప జేస్తాయి.రైల్వేలో గుమాస్తాగా పని చేసిన అల్లం శేషగిరిరావు సమాజాన్ని నిశితంగా పరిశీలించిన తీరు అమోఘం, అద్వితీయం, అస మానం. మనుషుల ధోరణు ల్లోని మానవీయ, అమానవీయ కోణాలను, అంతః సంఘర్షణలను అయన అర్థం చేసుకని కథా వస్తువులుగా మలచు కున్నాడు. తాను చేసుకున్న అవగాహనకు తనదైన భాష, శిల్పాలను జోడించి పాఠకుల హృదయాలను అంది పుచ్చుకునే అద్భుత కథలు రాశాడు. 1980లో 'మంచి ముత్యాలు' పేరిట పుస్తక రూపంలో వచ్చాయి. మరిన్ని కథలను కలుపుకుని 'అరణ్య ఘోష'గా వెలువడ్డాయి. ఇటీవల కథా స్రవంతి (అరసం) వారు 'అల్లం శేషగిరిరావు కథలు' పేరిట ఎంపిక చేసిన వాటిని ప్రచురించారు. శేషగిరిరావు రాసినవి తక్కువే. వాటిలోనూ కొన్ని సుదీర్ఘంగా సాగుతాయి. అయితే.. విషయ ప్రాధాన్యం, వైవిధ్యం మూలంగా ఆ నిడివి పాఠకులను అంతగా బాధించదు. 'మృగ తృష్ణ, వఱడు, ది డెత్ ఆఫ్ ఎ మేనిటర్, జాతి కుక్క, పులి చెరువులో పిట్టల వేట, అశ్వమేధం, నరమేధం, చీకటి' తదితరాలు శేషగిరిరావు కథల్లో చెప్పుకో దగినవి. మనిషికి ప్రతిబింబాలు 'వఱడు' కథ 'దర్పణ్ సీరిస్'లో భాగంగా దూరదర్శన్‌లో సింగిల్ ఎపిసోడ్‌గా ప్రసారమైంది.

# ఎఫ్‌టీఏతో యూరప్‌లో భారతీయ ఐటీ సంస్థలకు మెరుగైన అవకాశాలు




ప్రతిష్టాత్మక ఇండియా-యూరోపియన్ యూనియన్(ఈయూ) స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం(ఎఫ్‌టీఏ) జరగడం పట్ల ఐటీ పరిశ్రమల సంఘం నాస్కామ్ హర్షం వ్యక్తం చేసింది. ఈ ఒప్పందం ద్వారా దేశంలోని టెక్ పరిశ్రమకు మెరుగైన ఈయూ మార్కెట్ యాక్సెస్ లభిస్తుంది. ప్రస్తుతం యూరప్ భారతీయ ఐటీ సేవల సంస్థలకు ఆశాజనకమైన కేంద్రంగా అభివృద్ధి చెందుతోంది. టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో, హెచ్‌సీఎల్ టెక్ లాంటి సంస్థలు విస్తరిస్తున్నాయి. ఎఫ్‌టీఏ ద్వారా ఆయా కంపెనీలకు మరిన్ని ఒప్పందాలను సాధించడానికి సహాయపడుతుంది. వస్తువులపై గణనీయంగా సుంకాలు తగ్గనున్నప్పటికీ, సేవల రంగ లాభాల వల్ల మార్కెట్లో మరింత యాక్సెస్ లభిస్తుందని, నిబంధనల సడలింపు కలిసొస్తుందని నాస్కామ్ అభిప్రాయపడింది. ముఖ్యంగా ఎఫ్‌టీఏ ఖరారు కావడంతో భారతీయ ఐటీ ప్రొఫెషనల్స్‌కు అవకాశాలు మెరుగుపడతాయి. స్కిల్స్ ఉన్న ఉద్యోగులను సులభంగా బదిలీ చేయవచ్చని, సేవలను సజావుగా సరిహద్దు దాటేందుకు, సురక్షితమైన డేటా సరఫరాకు వీలవుతుంది. ఈ ఒప్పందంలో టెక్నాలజీ చిన్న భాగం కాదని నిపుణులు అంటున్నారు. ఇది భారత్‌ను ప్రపంచ ఐటీ లీడర్‌గా గుర్తిస్తుంది. డిజిటల్ వాణిజ్యం, ఈ-సేవలు, డేటా భద్రత, డిజిటల్ అథంటికేషన్‌ను ప్రోత్సహిస్తుంది. భారతీయ టెక్ కంపెనీలు యూరప్ డిజిటల్ ఆర్థిక వ్యవస్థతో మరింత లోతుగా కనెక్ట్ అవ్వడానికి సహాయపడుతుందని నాస్కామ్ పేర్కొంది.


## కొత్త భారత్ యాత్ర ట్రావెల్ కార్డును విడుదల చేసిన క్విక్-కామర్...




ప్రముఖ క్విక్ కామర్స్ ప్లాట్‌ఫామ్ బ్లింక్‌ఇట్ కొత్త ట్రావెల్ కార్డును విడుదల చేసింది. తన ప్లాట్‌ఫామ్ ద్వారా భారత యాత్ర పేరుతో తెచ్చిన ఈ కార్డు నేషనల్ కామన్ మొబిలిటీ కార్డ్(ఎన్‌సీఎంసీ) ఆధారంగా పనిచేస్తుంది. బ్లింక్‌ఇట్ ఈ కార్డును ఢిల్లీ ఎన్‌సీఆర్, బెంగళూరు, ముంబై, చెన్నై, అహ్మదాబాద్‌లలో అందుబాటులోకి తెచ్చింది. దీని ధర రూ. 50 ఉంటుందని, ఎలాంటి కేవైసీ ప్రక్రియ అవసరం లేదని కంపెనీ తెలిపింది. ఇదే సమయంలో ఒక్కో సిటీలో ఒక్కో ట్రావెల్ కార్డుల అవసరాన్ని కూడా తొలగిస్తుందని బ్లింకిట్ మాతృ సంస్థ ఎటర్నల్ గ్రూప్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ)గా త్వరలో బాధ్యతలు స్వీకరించనున్న అల్బిందర్ దిండ్సా అన్నారు. ఇది రూపే ఆధారిత కార్డు, తక్షణం యూపీఐ టాప్-అప్ సౌకర్యంతో పనిచేస్తుంది. దేశంలో వివిధ నగరాల్లో మెట్రో, బస్సులు వంటి ప్రజా రవాణాలో కీలకంగా ఉంటుందని దిండ్సా వివరించారు. ఈ కార్డును భారత్ యాత్ర మొబైల్ అప్లికేషన్ ఉపయోగించి లింక్ చేయడం ద్వారా యాక్టివేట్ చేసుకోవచ్చు. ఇది ఐదేళ్ల కాలపరిమితితో వస్తుందని, వ్యాలెట్‌లో రూ. 2,000 వరకు యాడ్ చేసుకోవచ్చని బ్లింక్‌ఇట్ పేర్కొంది.

ప్రస్తుత దీన్ని ఢిల్లీ, ముంబై, బెంగళూరు, చెన్నై, అహ్మదాబాద్‌లోని మెట్రోలకు, ముంబై, చెన్నైలోని బస్సు ప్రయాణాలకు ఉపయోగించవచ్చు. భారత్ యాత్ర కార్డ్ ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్ ఫ్లిప్‌కార్ట్‌లో కూడా అందుబాటులో ఉంది.

## ప్రీడయాబెటిస్ నయమైతే,58% తగ్గనున్న 'గుండె' ముప్పు!



లండన్: ప్రీడయాబెటిస్‌ను నయం చేసుకోగలిగిన వారికి హృదయ సంబంధిత వ్యాధుల ముప్పు 58 శాతం మేరకు తగ్గుతుంది. లండన్‌లోని కింగ్స్ కాలేజ్ పరిశోధకులు నిర్వహించిన అధ్యయనం ఈ విషయాన్ని వెల్లడించింది. రక్తంలో చక్కెర స్థాయి సాధారణం కన్నా అధికంగా ఉండటాన్నే ప్రీడయాబెటిస్ అంటారు. ఇది పూర్తి స్థాయి మధుమేహం కాకపోయినప్పటికీ, తీవ్రమైన గుండె సమస్యలకు దారి తీయవచ్చు. ప్రీడయాబెటిస్‌ను నయం చేసుకుంటే, తక్షణ గుండె పోటు ముప్పును తగ్గించుకోవడం మాత్రమే కాకుండా దీర్ఘ కాలంలో గుండెను కాపాడుకోవచ్చునని అధ్యయనకర్తలు తెలిపారు. వైద్య సలహా మేరకు మెరుగైన ఆహారాన్నితీసుకోవడం,ఎక్కువగాకదలడం, బరువును తగ్గించుకోవడం వంటి కార్యకలాపాలను చేయాలని సూచించారు.

## హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

**- ఎంఆర్‌పీఎస్ మండల ఇన్‌ఛార్జి అంబాల నరేష్ మాది**



**పెద్దపల్లి,తెలంగాణ దిశ :**నిరాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం తమ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడంలో పూర్తిగా విఫలమైందని ఎంఆర్‌పీఎస్ పెద్దపల్లి మండల ఇన్‌ఛార్జి అంబాల నరేష్ మాదిగ విమర్శించారు. శు క్రవారం పెద్దపల్లిలో మీడియాతో మాట్లాడిన ఆయన, వృద్ధులు, వితంతువు లు, వికలాంగుల పెన్షన్‌ను రెట్టింపు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని, అయితే అధికారంలోకి వచ్చి 20 నెలలు గడుస్తున్నా, ఇప్పటికీ పెన్షన్ పెంపు విషయంలో జాప్యం చేయడం పై మండిపడ్డారు. పెద్దపల్లిలో మీడియాతో మాట్లాడిన నరేష్ చేయూత పెన్షన్ దారుల ఆగ్రహానికి గురికాకముందే రేవంత్ రెడ్డి సర్కారు వెంటనే మేల్కోవాలని హితవు పలికా రు. వృద్ధులకు రూ. 4వేలు, వితంతువులకు రూ. 4వేలు, గీత కార్మికులకు, బీడీ కార్మికు లకు రూ. 4వేలు, వికలాంగు లకు రూ. 6వేల చొప్పున పెంచిన పెన్షన్ మొత్తాన్ని తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. గత 20 నెలల బకాయిలను కూడా వెంటనే మంజూరు చేయాలని ఆయన కోరారు. ఈ చర్యలను తక్షణమే చేపట్టడం ద్వారానే ప్రభుత్వం వృద్ధులు, వితంతు వులు, వికలాంగుల అభిమా నాన్ని చూరగొనగలుగుతుందని అంబాల నరేష్ మాదిగ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# రారండోయ్.. పసందైన విందిస్తాం!





గజిబిజి సిటీలైఫ్‌లో మనవైన రుచులు మర్చిపోతున్నాం. ఆఫీస్ నుంచి వస్తూ జంక్‌ఫుడ్ తినేస్తున్నాం. వీకెండ్స్‌లో హోటల్ తిండినే మృష్టాన్న భోజనం అని సరిపెట్టుకుంటున్నాం. ఉద్యోగాల పేరుతో.. ఇంటికి దూరంగా వచ్చిన వారి గురించైతే ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఇలాంటి పరిస్థితుల్లో మిమ్మల్ని ఎవరైనా ఇంటికి పిలిచి షడ్రసోపేతమైన విందు ఇస్తామంటే ఎలా ఉంటుంది. 'కాజ్ వై నాట్?' అదే చేస్తున్నది. ఇద్దరు అమ్మాయిల ఆలోచనలోంచి పుట్టిన ఈ సొల్యూషన్ ఇంటి వంటతో పసందైన విందు ఇస్తూనే, అనుబంధాలు విరిసే సరికొత్త సంప్రదాయానికి తెరతీసింది. సిటీలో నయా కల్చర్‌కు శ్రీకారం చుట్టిన సహన, శ్రీమయిల ఆ ఘుమఘుమలే ఇవి..

కరీంనగర్‌కు చెందిన పెద్ది సహన, మంచిర్యాలకు చెందిన రేణికుంట శ్రీమయి ఇద్దరూ దగ్గరి బంధువులు. పై చదువుల కోసమని జర్మనీకి సహన వెళ్లాల్సి వచ్చింది. అక్కడ తిండి తిప్పలు తట్టుకోలేక.. తన వంట తనే చేసుకునేది. చదువు ముగించుకొని హైదరాబాద్‌లో వ్యాపారం మొదలుపెట్టింది. ఎంత కష్టపడితే మాత్రం ఏముంది? రుచికరమైన ఆహారం లేక ఇబ్బందిగా ఫీలయ్యేది. వారంలో ఒక్కరోజైనా ఇంటి వంట తినాలనీ, స్నేహితులతో సరదాగా గడపాలనీ ఆమె ఆలోచన. ఏ రెస్టారెంట్‌కు వెళ్లినా.. ఇంటి రుచి దొరకలేదు ఆమెకు. స్నేహితులు ఎవరి బిజీలో వాళ్లు ఉండటంతో నలుగురితో కలిసే అవకాశమే గగనమైపోయింది. జీవితం ఇలా కృత్రిమంగా సాగిపోవడం సహనకు నచ్చలేదు. అదే సమయంలో హైదరాబాద్‌లో బీబీఏ ఫైనలియర్ చదువుతున్న శ్రీమయి ఆమెకు తోడైంది. ఇద్దరూ కలిసి మంచి భోజనం కోసం రోజంతా వెతికేవారు. అయినా వాళ్ల అభిరుచికి తగ్గ రుచి ఎక్కడా చవిచూడలేకపోయారు.

**వారే వండి వడ్డిస్తారు..:** రుచీపచీ లేకుండా రోజులు భారంగా సాగుతున్నాయి. ఈ మహానగరంలో తమలాగే ఇంటి భోజనం కోసం పరితపించేవాళ్లు ఎందరో ఉంటారు కదా అనుకున్నారు ఇద్దరు. మనమే వారికి అలాంటి ఫుడ్ ఎందుకు అందివ్వకూడదు అని 'కాజ్ వై నాట్?' ప్రారంభించారు. ఇంటికి దూరంగా ఉంటూ చప్పిడి తిండి తింటున్నవాళ్లందరికీ మేలైన రుచులు పంచాలని భావించారు. నెలలో రెండు శనివారాలు అతిథులకు ఆహ్వానం పలకాలని నిశ్చయించుకున్నారు. సోషల్ మీడియా వేదికగా 'కాజ్ వై నాట్?' పిలుపు ఇచ్చారు. తమ స్వహస్తాలతో రుచికరమైన పదార్థాలు చేసి, ఇంట్లోనే కూర్చుని, కులాసాగా కబుర్లు చెప్పుకొంటూ విందు ఆరగించే ఏర్పాటు చేశారు. ప్రారంభంలో ఎవరూ రారేమో అనుకొని తమ స్నేహితులనే ఆహ్వానించి విందు చేశారు. తిన్నవాళ్లంతా మెచ్చుకోవడంతో ప్రయాణాన్ని ముందుకు కొనసాగించారు.

**అదిరిపోయే మెనూ:** ప్రతి ఈవెంట్‌కు 10 నుంచి 20 మంది మాత్రమే హాజరయ్యేలా రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించారు. నామమాత్రంగా రుసుం వసూలు చేస్తారు. వీరి పిలుపు అందుకొని ఐటీ ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులు బాగానే స్పందిస్తున్నారు. మాదాపూర్, హైటెక్ సిటీ ఏరియాల్లో ఉన్న తమ బంధువుల ఇంటిని వెన్యూగా ఫిక్స్ చేస్తుంటారు సహన, శ్రీమయి. ప్రతిసారీ ఒకేరకమైన వంటకాలు కాకుండా సరికొత్త థీమ్‌లతో విందులు పంచుతున్నారు. శనివారం ఉదయాన్నే ఇద్దరూ రంగంలోకి దిగుతారు. తాజా కాయగూరలు తెచ్చి, స్వయంగా అనేక రకాల పదార్థాలూ వండేస్తారు. సాయంత్రానికి బిలబిలమంటూ అతిథులు వచ్చేస్తారు. పరిచయాలు పూర్తయ్యాక.. అరిటాకు వేసి మరీ భోజనాలు పెడతారు. కోరిన పదార్థాన్ని కొసరి కొసరి వడ్డిస్తారు. అప్పడాలు తింటూ, ముచ్చట్లు చెప్పుకొంటూ సందడిగా విందారగిస్తారంతా. పదార్థాల విషయంలో సంప్రదాయ వంటకాలకు పెద్దపీట వేస్తున్నారు సహన, శ్రీమయి. మక్క గట్క, అంబలి, ఉల్లికారం, ఎల్లిపాయ కారం, ముద్దపప్పు ఇలా.. పసందైన పదార్థాలు వండి వడ్డిస్తున్నారు.

**తక్కువ కాలంలోనే..:** తల్లిదండ్రులకు దూరంగా ఉద్యోగాలు చేసుకుంటూ, పై చదువులకోసమని హైదరాబాద్ నగరంలో జీవిస్తున్న వాళ్లకు అమ్మ చేతివంటను పరిచయం చేస్తున్న 'కాజ్ వై నాట్?' ప్రస్థానం మొదలై ఐదు నెలలే అయింది. ఎప్పుడెప్పుడు శనివారం వస్తుందా అని అతిథులు ఎదురు చూసేంతగా వీళ్లకు పేరొచ్చింది. ప్రస్తుతం నెలకు రెండు శనివారాలే అందిస్తున్న ఆతిథ్యం.. నాలుగు వారాలకు పెంచాలనే యోచనలో ఉన్నారు సహన, శ్రీమయి. అంతేకాదు హైటెక్‌సిటీ, మాదాపూర్‌కే పరిమితమైన వెన్యూలు నగరవ్యాప్తం చేయాలనే ఉద్దేశంతోనూ ఉన్నారు. ఈ ఇద్దరి ప్రయత్నం చవులూరించే విందును అందివ్వడమే కాకుండా.. ముచ్చటైన బంధాలకు వేదికగా నిలుస్తుండటం విశేషం.

## అన్వేష్ కోసం ముమ్మర దర్యాప్తు
## ఇన్‌స్టాగ్రామ్ నిర్వాహకులకు పోలీసుల లేఖ

**హైదరాబాద్,తెలంగాణ దిశ :**యూట్యూబర్ అన్వేష్‌పై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. అన్వేష్ యూజర్ ఐడీ వివరాలు సమర్పించాలని కోరుతూ ఇన్‌స్టాగ్రామ్ నిర్వాహకులకు పోలీసులు లేఖ రాశారు. ఇన్‌స్టాగ్రామ్ నుంచి సమాధానం కోసం పోలీసులు వేచి చూస్తున్నారు. కాగా.. ఇటీవల హిందూ దేవతలపై అన్వేష్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారాన్ని రేపాయి. విదేశాల్లో ఉంటూ దేవీదేవతలపై అన్వేష్ వివాదాస్పద కామెంట్స్ చేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. అన్వేష్‌ను వెంటనే అరెస్ట్ చేయాంటూ డిమాండ్‌లు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా ఈ వ్యాఖ్యలపై పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో అన్వేష్‌పై సినీనటి, బీజేపీ నేత కరాటే కళ్యాణి ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు అతడిపై బీఎన్ఎస్ సెక్షన్లు 352, 79, 299, ఐటీ చట్టంలోని 67 సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. అలాగే తెలంగాణ వ్యాప్తంగా కూడా అన్వేష్‌పై వరుస ఫిర్యాదులు వస్తున్నాయి. అన్వేష్‌ను వెంటనే భారత్‌కు రప్పించాలని... అరెస్ట్ చేయాలని హిందూ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. హీరోయిన్ల వస్త్రధారణపై నటుడు శివాజీ చేసిన కామెంట్స్‌ను నిరసిస్తూ అన్వేష్ ఓ వీడియో చేశారు. అంతా బానే ఉంది. కానీ ఆ వీడియోలోనే హిందువులు దేవతగా కొలిచే సీతమ్మ వారితో పాటు ద్రౌపదిపై అన్వేష్ జుగుప్సకరమైన వ్యాఖ్యలు చేశారు. దీంతో హిందూ సంఘాలతో పాటు నెటిజన్లు కూడా ఆ వీడియోపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు.

# కాపు దళిత నినాదంతో కొత్త పార్టీ

**విజయవాడ,తెలంగాణ దిశ :** ఆంధ్రప్రదేశ్ రాజకీయ యవనికపై మరో కొత్త అధ్యాయం మొదలుకానుందా? గడిచిన ఎన్నికల్లో కూటమి ప్రభంజనం ముందు డీలాపడ్డ ప్రతిపక్షం.. ఇప్పుడు సరికొత్త వ్యూహానికి తెరలేపుతోందా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. రాజకీయ వర్గాల్లో ప్రస్తుతం జోరుగా సాగుతున్న ప్రచారం ప్రకారం.. ఏపీలో కాపు, దళిత సామాజిక వర్గాల కలయికతో ఒక కొత్త రాజకీయ పార్టీ ఆవిర్భవించే దిశగా వడివడిగా అడుగులు పడుతున్నాయి. సస్పెండెడ్ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్ వ్యూహ రచన, దివంగత నేత వంగవీటి మోహన రంగా కుమార్తె వంగవీటి ఆశ భాగస్వామ్యంతో ఈ కొత్త శక్తి తెరపైకి రాబోతోందని విశ్వసనీయ సమాచారం. కొంతకాలం క్రితం సస్పెండెడ్ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్ చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. "కాపులు, దళితులు ఏకతాటిపైకి వస్తేనే రాజ్యాధికారం సాధ్యం. కాపు సామాజిక వర్గానికి ముఖ్యమంత్రి పీఠం, దళితులకు ఉపముఖ్యమంత్రి పదవి దక్కాలి" అనేది ఆయన ప్రతిపాదన. ఒక మాజీ అధికారిగా కాకుండా, ఒక పొలిటికల్ స్ట్రాటజిస్ట్‌లా ఆయన చేసిన ఈ వ్యాఖ్యల వెనుక వైసీపీ పెద్దల హస్తం ఉందనేది బలంగా వినిపిస్తున్న ఆరోపణ. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కీలక బాధ్యతలు నిర్వర్తించి, ఆ పార్టీకి అనుకూలంగా వ్యవహరించారనే ముద్ర పడిన సునీల్ కుమార్.. ఇప్పుడు తెరవెనుక ఉంటూ ఈ కొత్త రాజకీయ ప్రయోగానికి రూపకల్పన చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ కొత్త సమీకరణంలో ప్రధాన ఆకర్షణ వంగవీటి ఆశ. దివంగత వంగవీటి మోహన రంగాకు కాపు సామాజిక వర్గంలో ఉన్న ఆరాధన భావం గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఇటీవల విశాఖలో నిర్వహించిన 'రంగా సేన' ఆత్మీయ సమ్మేళనం ఈ కొత్త పార్టీ ఊహాగానాలకు ఊపిరి పోసింది. ఈ సభలో కాపులతో పాటు దళితులు, బీసీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రంగా ఆశయ సాధన కోసం కొత్త వేదిక అవసరం అని మెజారిటీ కార్యకర్తలు ఆశాభావం వ్యక్తం చేయడం గమనార్హం. వంగవీటి రాధా రాజకీయంగా మౌనంగా ఉంటున్న తరుణంలో, రంగా వారసత్వాన్ని అందిపుచ్చుకుని, ఆయన ఇమేజ్ ద్వారా కాపు యువతను ఆకర్షించడానికి వంగవీటి ఆశను ముందు పెడుతున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. 2024 ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ఘనవిజయం సాధించడానికి ప్రధాన కారణం కాపు ఓట్ల ఏకీకరణ. పవన్ కళ్యాణ్ చొరవతో కాపు ఓట్లు గంపగుత్తగా కూటమికి పడ్డాయి. ఇది వైసీపీని కోలుకోలేని దెబ్బ తీసింది. వచ్చే ఎన్నికల నాటికి ఈ ఓటు బ్యాంకును చీల్చకపోతే వైసీపీకి భవిష్యత్తు కష్టమే. అందుకే, నేరుగా వైసీపీలో చేరలేని కాపు, దళిత వర్గాలను ఆకర్షించడానికి ఒక మూడో ప్రత్యామ్నాయం లేదా కొత్త పార్టీ అవసరం ఏర్పడింది. ఈ నేపథ్యంలోనే.. రంగా సెంటిమెంట్ ను వాడుకుని కాపు ఓట్లను చీల్చడం, దానికి దళిత ఓట్లను జత చేయడం ద్వారా కూటమి ఓటు బ్యాంకుకు గండి కొట్టాలనేది మాస్టర్ ప్లాన్ గా కనిపిస్తోంది. పీవీ సునీల్ కుమార్, వంగవీటి ఆశలతో పాటు మరికొందరు వైసీపీ సానుభూతిపరులు, మేధావులు ఈ పార్టీలో కీలక పాత్ర పోషించే అవకాశం ఉంది. అయితే, కేవలం సామాజిక సమీకరణాలతో పార్టీని నడపడం అంత సులభం కాదు. వంగవీటి ఆశకు క్షేత్రస్థాయిలో రాజకీయ అనుభవం తక్కువ. పవన్ కళ్యాణ్ లాంటి ఛరిష్మా ఉన్న నేత ముందు ఆమె ఎంతవరకు నిలబడగలరనేది ప్రశ్న. గతంలో కాపు, దళిత సామాజిక వర్గాలను ఏకం చేయడానికి జరిగిన ప్రయత్నాలు బెడిసికొట్టాయి.

బీఎస్పీ-జనసేన పొత్తు ఆశించిన ఫలితాలను ఇవ్వలేదు. ఈ రెండు వర్గాల మధ్య క్షేత్రస్థాయిలో ఉన్న అంతరాలను చెరిపివేయడం కత్తి మీదసాము లాంటిది. అన్నిటికీ మించి ఈ కొత్త పార్టీ వెనుక జగన్ మోహన్ రెడ్డి ఉన్నారనే ప్రచారం ప్రజల్లోకి బలంగా వెళితే, అది అంతిమంగా ఆ పార్టీ విశ్వసనీయతను దెబ్బతీస్తుంది. మొత్తానికి, ఏపీలో మరో కొత్త పార్టీ ఆవిర్భావానికి రంగం సిద్ధమవుతోందన్నది కాదనలేని సత్యం. వచ్చేఎన్నికల నాటికిపూర్తిస్థాయిలోయాక్టివ్ అయ్యేలా గ్రౌండ్ వర్క్ జరుగుతోంది. ఇది కేవలం ఓట్ల చీలిక కోసమే పుడుతోందా? లేక నిజంగానే బడుగు, బలహీన వర్గాలకు ప్రత్యామ్నాయ వేదిక అవుతుందా? అనేది కాలమే నిర్ణయించాలి.

# ఏ వలువల విలువలు తెలుసుకోండి

## స్వేచ్ఛ.. అంటే అర్థనగ్న ప్రదర్శన కారాదు

**రచన: లక్ష్మి మదన్**

గజ్వేల్, : ఇంటి నుండి క్రమశిక్షణ మొదలవుతుంది. బాల్యంలో తల్లి మార్గదర్శి. ఆమె ఏం చెప్పినా పిల్లలు తప్పకుండా పాటిస్తుంటారు. ఆ తర్వాత తండ్రి పాలనలో పిల్లలు ఎన్నో నేర్చుకుం టున్నారు. ఇది మన భారతీయ సంస్కృతి. విద్య, వినయం, వస్త్రధారణ ఇవన్నీ ముందుగా తల్లి ద్వారా పిల్లలు నేర్చుకుంటారు. ముఖ్యంగా పిల్లలు తల్లిని గమనిస్తుంటారు. ఆమె కట్టు బొట్టును ఇష్టపడతారు. ఏమరుపాటులో ఎప్పుడైనా తల్లి ముఖంలో బొట్టు కనబడకపోతే చిన్నారి చేతులతో బొట్టు తెచ్చి పెడతారు. ఇది అందరికీ అనుభవమే. చీర కొంగు కాస్త పక్కకు జరిగితే, ఆ బిడ్డడు ముఖ్యంగా మగ పిల్లవాడు తల్లి కొంగు సరి చేస్తాడు. వాడికి తెలియకుండానే తల్లి బాగుండాలి అని కోరుకుంటాడు. ఇవన్నీ ఏ రాజ్యాంగం లోనూ రాసి ఉండవు. కాలక్రమేణా నేర్చుకుంటున్నాము. అనాదిగా ఆకులు కట్టుకున్న మనిషి మెల్లమెల్లగా వస్త్రాలను ధరించడం ఎలా నేర్చుకున్నాడో ,అలాగే నెమ్మదిగా ఈ తరంలో కొందరు ముందుకు వెళ్లకుండా మళ్లీ ఆదిమానవుడి వైపు వెళ్ళిపోతున్నారు. స్వేచ్ఛ అనేది ఒకరు ఇస్తే వచ్చేది కాదు. మనకి మనం నియంత్రించుకునేది. 'నీ ఇష్టం వచ్చినట్లుగా ఉండు' అని చెప్తే, పరిమితులు దాటి ఉండమని చెప్పడం కాదు. నువ్వు ఎలా ఉండాలో నిర్ణయించుకోవాలి అని అర్థం. నీ శరీరాన్ని నలుగురిలోకి వెళ్ళినప్పుడు ఎలాంటి దుస్తులతో అలంకరించుకోవాలి అనేది ఆలోచించుకోవాలి. నలుగురిలోకి వెళితే నీకు నచ్చిన బట్టలు కాదు కట్టు కోవాల్సింది. ఏ వలువ ధరిస్తే విలువ పెరుగుతుందో అది ఆలోచించు కోవాలి. అలాగని చీరలే కట్టుకోవాలి అనే సిద్ధాంతం ఎక్కడా లేదు. నిండుగా ఉన్న ఏ వస్త్ర ధారణ ఏదైనా స్త్రీకి అందమే! ఇంట్లో తల్లిదండ్రులకు కూడా పిల్లల వస్త్రధారణ గురించి చెప్పే హక్కు లేదు అనడం ఎంతవరకు సబబు? రేపు ఆ పిల్లలు ఏ విధంగానైనా నష్టపోతే తల్లిదండ్రులకే కదా బాధ కలిగేది. ఇలా మాట్లాడిన వాళ్లు వచ్చి రక్షణ కల్పిస్తారా? కొందరు వితండ వాదనలు చేస్తారు. ఎన్నో ఆకృత్యాలు పిల్లలు వృద్ధుల మీద జరుగుతున్నాయి. మరి వాళ్లే దుస్తులు ధరించారని? అని. దానిని ఈ విషయంతో ముడి పెట్టవద్దు. మనిషి మృగంగా మారినప్పుడు అలాంటి ఆకృత్యాలు జరుగుతాయి. సమాజంలో ఉన్నప్పుడు మనిషి లోపల ఉన్న వికృతమైన కోరికను స్పృషించడం ద్వారా తీర్చుకోవాలని ప్రయత్నం చేస్తాడు. నా స్వేచ్ఛ నా ఇష్టం అనేది ఎవరికి వర్తించదు. ఆ స్వేచ్ఛ కావాలనుకుంటే ఇంటి వరకే పరిమిత చేసుకోవాలి. సభ్య సమాజంలో ఉన్నప్పుడు కొన్ని పరిమితులను పాటించాలి. అర్ధనగ్న వస్త్రధారణ చేసుకొని, వారితోపాటు రక్షించే వారిని వెంట తీసుకొని వెళ్లాలట? ఆ వెంట తీసుకెళ్లే రక్షకుల బదులుగా నిండుగా వస్త్రం కప్పుకుంటే ఎంతో మేలు కదా! చిన్న విషయాన్ని అంత పెద్దదిగా ఎందుకు ఆలోచించాలి? విలువైన వస్తువులన్నీ లాకర్లలో పెట్టుకుంటాము. ఇంట్లో భద్రంగా దాచుకుంటాము. కానీ శరీర భాగాలు అంతకన్నా విలువ లేనివా? వాటిని నిర్లజ్జగా ప్రదర్శించడం ఎంతవరకు సమంజసం? ప్రతి ఒక్కరూ న్యాయం వైపు స్పందిస్తారు. అలాగే న్యాయం వైపే స్పందించారు. ఒక మహిళ మరో మహిళను సపోర్టు చేయడానికి ఇష్టపడుతుంది. కానీ పరిమితులు దాటిన మహిళలను ఏ మహిళ సపోర్ట్ చేయడానికి ఇష్టపడదు. మన ఇంట్లో నాన్న ,అన్న, తమ్ముడు, కొడుకు ఎవరికైనా మనకి హితవు చెప్పే హక్కు ఉంది. ఎందుకంటే వారిలో ప్రేమ, ఆప్యాయత తమ వారి రక్షణ బాధ్యత ఇవన్నీ ఉంటాయి. తన వారికి ఏమైపోతుందో అనే ఆందోళన కూడా ఉంటుంది. ఫలానా వారి ఇంటి ఆడపిల్ల అంటే గౌరవంగా చూడాలి అని ఆకాంక్ష కూడా ఉంటుంది. అదంతా తప్పేమీ కాదు. దానిని భూతద్దంలో నుండి చూసి స్పందించాల్సిన అవసరం లేదు. అవును మన వాళ్లు మనకు చెప్పే తీరుతారు. అలాగే సమాజంలో అలాంటి స్థానాన్ని తీసుకొని మంచి చెప్తే అర్థం చేసుకొని ఆచరించి చూపించాలి. అంతేకానీ పంతానికి పోయి మరింత నిర్లజ్జగా వ్యవహరిస్తా మంటే రేపు నష్టపోయేది వారే. రేపటి తరానికి వారు చేయబోయే నష్టం చాలా ఎక్కువ. రేపు వారి పిల్లల దృష్టిలో కూడా చులకన అయిపోతారు. ఇలా ఆలోచిస్తే ఏ మహిళ అసహ్యమైన దుస్తులు వేసుకొని నలుగురులోకి రారు. ఆడవాళ్ళకే ఆంక్షలా? అనే ప్రశ్న వేస్తున్నారు. మరి ఎక్కువగా ఆడవాళ్ళకే నష్టం జరుగుతుంది. ఇంట్లో తల్లిదండ్రులు మగవాళ్ళకి కూడా చెప్పే తీరుగా చెప్తుంటారు. కానీ నలుగురిలో ఒక వస్త్రం జారిపోతే మగవాడు పెద్దగా ఇబ్బంది పడడేమో! మరి అదే స్త్రీ కి ఎలా ఉంటుంది? ప్రాణం పోయినట్లుగా అనిపిస్తుంది. ఇక విషయం మీద మహిళలతో పాటు పురుషులు కూడా మంచిగా స్పందిస్తున్నారు అంటే ఇంకా అర్థం కావడం లేదా? మా స్వేచ్ఛ మాకు ఉండాలి అని అనుకున్నప్పుడు అవతల చూసే వారి కళ్ళు వాళ్ల స్వేచ్ఛ కోరుకుంటాయి! వెనకట

ఒక సామెత ఉంది చింత కాయలకు ఆజ్ఞ కాని, గుటకలకు కాదు కదా అని! అంటే ఒక చెట్టుకు చింతకాయలు ఉంటే అవి కోసుకుంటే మనం ఉల్లంఘన చేసినట్లే. కానీ అవి చూసి నోరూరుతే ఆ తోటమాలికి అవసరం లేదు కదా! ఇది ఈనాటి సామెత కాదు ఏనాటిదో! మన పెద్దలు ఇలాంటివి ఊరికనే చెప్పారా? నీ వస్త్రధారణ చూసి అవతలి వారు గుటకలు వేయడంలో వారి స్వేచ్ఛ అది.. మహిళా వాదులం అంటూ ఇష్టమున్న వ్యాఖ్యలను చేయడం మానుకొని, సమాజానికి ఏది ఉపయోగమో అది చేయండి. ఎంతోమంది మహిళా వాదులు చాలా మంచిగా విషయాలు అర్థం చేసుకుని సమాజానికి వివరిస్తున్నారు. ఇది చాలా మంచి పరిణామం. ఎక్కడ ఆడవాళ్ల గౌరవింప పడతారో అక్కడ దేవతలు పూజింపబడతారు. గౌరవింపబడేలాగా మనం ఉండాలి. అలాగే మగవారి దృష్టి కోణం కూడా మారాలి.

# ఆర్థిక ఆయుధంగా ఇరాన్



న్యూఢిల్లీ,: ఇరాన్?అమెరికా మధ్య ఉద్రిక్తతలు హోర్మూజ్ జలసంధిని కేంద్రంగా మరింత తీవ్రస్థితి చేరాయి. చర్చలు విఫలమై, ఇరాన్ జలసంధిపై కఠిన నియంత్రణలు ప్రకటించింది. ప్రపంచ చమురు సరఫరా దీనిపై ఆధారపడుతున్న నేపథ్యంలో ఆర్థిక ఆందోళనలు పెరుగుతున్నాయి. ఇస్లామాబాద్‌లో 21 గంటల సుదీర్ఘ చర్చలు ఫలితం లేకుండా ముగిశాయి. అమెరికా అణు కార్యక్రమంపై 20 సంవత్సరాల ఫ్రీజ్, జలసంధి దిగ్బంధనాలు డిమాండ్ చేసింది. ఇరాన్ ఇజ్రాయెల్, అమెరికా 'అర్థరహిత' షరతులను తిరస్కరించి, యుద్ధానికి సిద్ధంగా ఉన్నామని సవాల్ చేసింది. ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ 'ఇరాన్‌కు బ్యాడ్ న్యూస్' అని హెచ్చరించారు. ఈ క్రమంలో ఇరాన్ శత్రుదేశా లకు షాక్ ఇచ్చేలా కొత్త చట్టం రూపొందిస్తోంది.ఇరాన్ సంయుక్త సైనిక ఆదేశాలు జలసంధిని తమ పూర్తి నియంత్రణలో ఉంచుతూ, అమెరికా దిగ్బంధనాలు ఉన్నంతకాలం రవాణాను అడ్డుకుంటామని ప్రకటించాయి. గత 50 రోజుల్లో ఆంక్షలు విధించి, ఇటీవల తెరిచినా మళ్లీ మూసివేశారు. ప్రపంచ చమురు, గ్యాస్ రవాణాకు ఇది కీల యం. తాజా నిర్ణయంతో చమురు రవాణాకు బ్రేక్ పడింది. పార్లమెంటరీ సివిల్ ఇంజనీరింగ్ కమిటీ చైర్మన్ మహమ్మద్ రెజాయ్ కూచీ ప్రకటించిన ముసాయిదా తుది దశలో ఉంది. ఇజ్రాయెల్ సంబంధ నౌకలపై పూర్తి నిషేధం ఉంటుంది. హర్మూజ్ దాటాలంటే జాతీయ భద్రతా మండలి అనుమతి తీసుకోవాలి. యుద్ధం కారణంగా జరిగిన నష్టానికి పరిహారం చెల్లించకపోతే ప్రయాణానికి అనుమతి ఇవ్వరు. రవాణా రుసుము ఇరాన్ కరెన్సీలో మాత్రమే చెల్లించాలి. భద్రత 'ఉచితం కాదు' అని ఉపాధ్యక్షుడు మహ్మద్ రెజా ఆరిఫ్ హెచ్చరించారు. ఇరాన్ నిర్ణయంతో చమురు ధరలు 100-120 డాలర్ల వరకు రికార్డు స్థాయిలు చేరాయి. హర్మూజ్ మూసివేతతో 20 శాతానికిపైగా పెరిగే అవకాశం ఉంది. గల్ఫ్ దేశాల నుంచి 40 శాతంపైగా చమురు దిగుమతి చేసుకునే భారత్ ఇప్పుడు ఆఫ్రికా, రష్యా నుంచి ఎక్కువగా దిగుమతి చేసుకుంటోంది. మరోవైపు పెట్రోల్?డీజిల్ ధరలు 15?90 శాతం పెరిగాయి. చైనా, యూరప్‌లో కూడా ఇంధన కొరత పెరుగుతోంది. మధ్యప్రాచ్య చమురుపై ఆధారపడి ఉన్న భారత్‌లో పెట్రో ఉత్పత్తుల ధరలు ఆకాశతాకు తాయి.ఇరాన్ ప్రతీకార వ్యూహం ఆర్థిక ఆయుధంగా మారింది. చర్చలు ఆలస్యమైతే ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ముప్పు. భారత్ వంటి దేశాలు వైవిధ్యమైన మూలాలపై దృష్టి పెట్టాలి.

# జాతీయ పార్టీగా జనసేన




**అనంతపురం,తెలంగాణ దిశ :** జనసేన నాయకత్వం ఒక పద్ధతి ప్రకారం ముందుకు వెళ్తోంది. ఏపీలో కూటమిపరంగా అధికారంలోకి వచ్చిన ఆ పార్టీ.. ఇప్పుడు దక్షిణాది రాష్ట్రాలపై దృష్టి పెట్టినట్లు ప్రచారం నడుస్తోంది. పార్టీ విస్తరణ పై సరవేగంగా అడుగులు వేస్తోంది. ఈ క్రమంలో కేరళలో ఆ పార్టీ విస్తరణ జరిగింది. ఆ రాష్ట్రంలో వివిధ పార్టీల్లోని 200 మంది నేతలు జనసేనలో చేరడంవిశేషం. జనసేన అగ్ర నేతలు నాగబాబు, రామ్ తాళ్లూరిల సమక్షంలో కేరళలో జనసేనలో చేరికలు పెరిగాయి. కేరళ నుంచి వచ్చిన వినతులు మేరకు పవన్ కళ్యాణ్ స్పందించారు. నాగబాబు తో పాటు రామ్ తాల్లూరిలను అక్కడకు పంపించారు. అయితే కేరళలో పెద్ద ఎత్తున నేతలు జనసేనలో చేరడం ఇప్పుడు కొత్త ప్రచారానికి తెరతీసింది. మున్ముందు జనసేన రాజకీయ ప్రయాణం దక్షిణాది రాష్ట్రాల్లో విస్తరించనుందని అర్థమవుతోంది.పవన్ కళ్యాణ్‌ఎప్పుడు దూకుడు రాజకీయాలు చేయలేదు. జనసేన పరంగా దూకుడుగా అడుగులు వేయలేదు. ముందుగా ఏపీలో సిద్ధాంత పరంగా ముందుకు వెళ్లారు. సంప్రదాయ రాజకీయ పార్టీ మాదిరిగా అస్సలు వ్యవహరించలేదు. తమ పార్టీ సిద్ధాంతాలు నచ్చితేనే కొనసా గాలని కుండబద్దలు కొట్టారు నాయకులకు. భారతీయ జనతా పార్టీ మాదిరిగా సిద్ధాంత పరంగా జనసేనను నిలబెట్టాలని చూశారు. ఈ క్రమంలో హిందుత్వ వాదాన్ని, సనాతన ధర్మ పరిరక్షణ నినాదాన్ని అందుకున్నారు. దీని వెనుక లోతైన వ్యూహం ఉంది. ఇప్పటికే దక్షిణాది రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలు బలంగా ఉన్నాయి. కానీ బలమైన సిద్ధాం తాల నడుమ అవి కొనసాగుతున్నాయి. తమిళనాడులో ద్రవిడ సిద్ధాం తం పూర్తిగా రాజకీయ పార్టీలను కబలించింది. అటువంటి చోట సనాతన ధర్మం అంటూ పెద్ద ఎత్తున ప్రచారం చేసి.. ఒక వర్గం ప్రజలను ఆకర్షించగలిగారు పవన్ కళ్యాణ్. ఇప్పుడు అదే వ్యూహంతో దక్షిణాది రాష్ట్రాలపై ఫుల్ ఫోకస్ పెట్టారు. ఇప్పుడు కేరళలో అది వర్క్ అవుట్ అయ్యేలా కనిపిస్తోంది.పెద్ద ఎత్తున నేతల చేరిక.. తిరువనంతపురంలోజరిగిన జనసేన సమావేశంలో చాలామంది నేతలు ఆపార్టీలో చేరారు.ప్రధానంగా నేషనల్‌లేబర్ పార్టీ, హిందుస్థాన్ అవామీ మోర్చా, ఆల్ ఇండియా ముస్లిం లీగ్ పార్టీ, లోక్ జనశక్తి పార్టీ, రాష్ట్రీయలోక్ దళ్, కాంగ్రెస్ పార్టీలనుంచి 200మందికి పైగా నాయకులు, కార్యకర్తలు జనసేన పార్టీలో చేరారు. అయితే ఈ ఉత్సాహం చూస్తుంటే మాత్రం తదుపరి లక్ష్యంగా కర్ణాటక పై దృష్టి పెట్టే ఛాన్స్ కనిపిస్తోంది. క్రమేపి తమిళనాడుతో పాటు తెలంగాణలో కూడా పార్టీ విస్తరించి.. జాతీయ పార్టీగా అవతరించే దిశగా అడుగులు పడుతున్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా పవన్ కళ్యాణ్ భావజాలం భాషలతో పాటు ప్రాంతాలకు అతీతంగా దేశస్థా యిలో ప్రజలను ఆకట్టుకుంటుందని జనసేన నాయకత్వం భావిస్తోంది.

## మున్సిపల్ కమిషనర్ కు వినతిపత్రం అందజేసిన కూన శ్రీశైలం గౌడ్



**కుత్బుల్లాపూర్,తెలంగాణ దిశ :** కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు శ్రీశైలం గౌడ్ ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ నియోజక వర్గ పరిధిలోని వల్లభాయ్ పటేల్ నగర్ కాలనీ, అంబేద్కర్ నగర్ వాసులు ఎదుర్కొంటున్న ఇంటి నిర్మాణ పన్నులు, జరిమానాల గురించి సైబరాబాద్ మునిసిపల్ కమిషనర్ ని కలిసి సమస్య వివరించడం వినతి పత్రము అందజేయడం జరిగింది. వారి సమస్యలు పూర్తిగా విన్న సైబరాబాద్ కమిషనర్ సృజన , జరిమానాలు వేసిన సంబంధిత మున్సిపల్ అధికారులతో మాట్లాడి సమస్యను పూర్తిస్థాయి లో పరిష్కరిస్తానని తెలియజేశారు. అదే విధంగా కుత్బుల్లాపూర్ జోన్ పరిధిలోని ఆరు సర్కిలలో చేపట్టవలసిన అభివృద్ధి పనులకు సంబంధించి సమగ్ర వివరాలను సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ అందజేశారు.

ఈ పనులు ప్రభుత్వం నుండి మంజూరైనప్పటికీ ప్రస్తుతం కొన్ని టెండర్ ప్రక్రియలో ఆగిపొవడం జరిగిందని వాటిని వేగవంతం చేసి పనులు ప్రారంభించాలని కమిషనర్ కోరారు, కమిషనర్ కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్ సైతం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కొంపల్లి మాజీ సర్పంచ్ జిమ్మి దేవేందర్, బుచ్చిరెడ్డి, మాజీ కార్పొరేటర్ ఆగం పాండు, మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డి, మోటే శ్రీనివాస యాదవ్ అరువ వెంకట్, సాయికిరణ్, గోపాల్ రెడ్డి గుమస్తా మధుసూదన్ , వల్లభాయ్ పటేల్ నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రామ్ రెడ్డి, సభ్యులు ఎన్ వి రెడ్డి, కృష్ణ, రాము, బుచ్చిరెడ్డి, ఇంద్రసేనారెడ్డి, లక్ష్మారెడ్డి, గోవర్ధన్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, మాణిక్య రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తెలంగాణలో పెరగనున్న.. భూముల ధరలు




హైదరాబాద్, : తెలంగాణలో భూముల మార్కెట్ విలువలను సవరించేందుకు రేవంత్ సర్కార్ రెడీ అయింది. వ్యవసాయ భూముల విలువ గరిష్టంగా 300 శాతం పెరగనుండగా.. ఓఆర్ఆర్ పరిసరాల్లోని ప్లాట్ల రేట్లు మూడింతలు కానున్నట్లు తెలిసింది. అపార్ట్‌మెంట్ ఫ్లాట్ల ధరలను స్వల్పంగా పెంచి.. కమర్షియల్ స్పేస్ రేట్లను మాత్రం తగ్గించాలని ప్రతిపాదించారు. రిసోర్స్ మొబిలైజేషన్ కేబినెట్ సబ్ కమిటీ ఆమోదం అనంతరం ఈ కొత్త ధరలు అమల్లోకి రానున్నాయి. దీనివల్ల ప్రభుత్వానికి ఆదాయం పెరగడమే కాకుండా రియల్ రంగంలో పారదర్శకత రానుంది.తెలంగాణలో రియల్ ఎస్టేట్ రంగానికి ఊపునిచ్చేలా రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం తీసుకునేందుకు రెడీ అయింది. రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ భూములు, నివాస స్థలాల మార్కెట్ విలువను భారీగా పెంచేందుకు రేవంత్ సర్కార్ కసరత్తు చేస్తోంది. వచ్చే నెలలో లేదా జూన్ నుంచి ఈ పెరిగిన ధరలు అమల్లోకి వచ్చేఅవకాశం ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భూముల విలువను సవరించడం ఇదే తొలిసారి కావడంతో రియల్‌ఎస్టేట్ రంగంలో ఈ అంశం హాట్ టాపిక్‌గా మారింది. ప్రభుత్వ ప్రతిపాదనల ప్రకారం.. వ్యవసాయ భూముల మార్కెట్ విలువ గరిష్టంగా రెండు నుంచి మూడు రెట్లు పెరగనుంది. ప్రస్తుతం ఎకరాకు రూ. 6 లక్షలుగా ఉన్న విలువ రూ. 12 లక్షల నుంచి రూ. 18 లక్షల వరకు పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా నగర శివార్లలోని కోర్‌అర్బన్ ప్రాంతాల్లో మార్కెట్‌విలువ బహిరంగ మార్కెట్ రేట్ల కంటే చాలా తక్కువగా ఉంది. కొన్ని ప్రాంతాల్లో ఎకరా విలువ ప్రభుత్వలెక్కల్లో రూ. 20లక్షలు ఉంటే.. బయట రూ. 10 కోట్ల నుంచి రూ. 20 కోట్లు పలుకుతోంది. ఇలాంటి చోట్ల మార్కెట్ విలువను ఏకంగా 300 శాతానికి పైగా పెంచి అసమానతలను తగ్గించాలని సర్కార్ భావిస్తోంది.ఔటర్ రింగ్ రోడ్ పరిసర ప్రాంతాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించింది. రీజినల్ రింగ్ రోడ్, ఫ్యూచర్ సిటీ వంటి ప్రాజెక్టుల వల్ల ఈ ప్రాంతాల్లో భూములకు డిమాండ్ విపరీతంగా పెరిగింది. దీనికి అనుగుణంగానే ఇక్కడి ఓపెన్ ప్లాట్లు, నివాస స్థలాల ధరలను 2 నుంచి 3 రెట్లు పెంచనున్నారు. అలాగే అపార్ట్‌మెంట్లలోని ఫ్లాట్ల విలువను కూడా స్వల్పంగా పెంచనున్నారు. ప్రస్తుతం ఎస్ఎఫ్‌టీకి రూ.2,200 ఉన్న ధరను రూ. 2,800 కు పెంచే అవకాశం ఉంది. ఈ నిర్ణయంతో రిజిస్ట్రేషన్ ఖర్చులు పెరిగిన ప్పటికీ.. బ్లాక్ మనీ లావాదేవీలు తగ్గి పారదర్శకత పెరుగుతుందని భావిస్తున్నారు.నివాస స్థలాల రేట్లు పెరుగుతున్నా, వాణిజ్య స్థలాల విషయంలో ప్రభుత్వం ఊరటనిచ్చే నిర్ణయం తీసుకుంది.ప్రస్తుతం మార్కెట్ రేట్ల కంటే ఎక్కువగా ఉన్న కొన్ని ప్రాంతాల్లో కమర్షియల్ స్పేస్ విలువను తగ్గించాలని ప్రతిపాదిం చారు. ఎస్ఎఫ్‌టీకి రూ.7 వేలుఉన్న విలువను రూ. 6,500 కి తగ్గించే అవకాశం ఉంది. దీనివల్ల కొత్త కంపెనీలు, పరిశ్రమలు రాష్ట్రానికి వచ్చేందుకు ఆసక్తి చూపుతాయని తద్వారా ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది. కేబినెట్ సబ్ కమిటీ అధ్యయనం తర్వాత దీనిపై అధికారిక ప్రకటన వెలువడనుంది.

# కాంగ్రెస్ కంచుకోటలకు బీటలు



చెన్నై, : దాదాపు 50 ఏళ్ల తర్వాత లోక్‌సభ సీట్లు పెంచేందుకు కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఓ ప్రయత్నం చేసింది. ప్రస్తుతం ఉన్న 543 సీట్లు 1977లో కాంగ్రెస్ ప్రభుత్వం చేసినవే. తాజాగా 130వ రాజ్యాంగ సవరణ ద్వారా లోక్‌సభ స్థానాలు 816కు పెంచడంతోపాటు మహిళలకు 33 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని కేబినెట్ నిర్ణయించింది. ఈమేరకు పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి రాజ్యాంగ సవరణ బిల్లు పెట్టింది. అయితే ఈ బిల్లే కాంగ్రెస్‌ను భయపెట్టింది. ఈ బిల్లు ఆమోదం పొందితే కాంగ్రెస్ భవిష్యత్ ప్రశ్నార్థకమవుతుంది. ఉనికే లేకుండా పోతుంది. అందుకే కాంగ్రెస్ విపక్షాలను ఏకం చేసి బిల్లును వ్యతిరేకించడంలో విజయవంతమైంది.కాంగ్రెస్ 50 ఏళ్ల పాలనలో తమ అనుకూలంగా సీట్లను ఒకటిగా, వ్యతిరేక సీట్లలో ఓటర్లను విభజించి అనుకూల నియోజకవర్గాల్లో కలపడం వంటివి చేసింది. తెలంగాణలో 2008?09 పునర్విభజనలో హైదరాబాద్ హిందూ ఓటర్లను ముస్లిం బలమైన పాత్‌బస్తీ ప్రాంతాలతో కలిపి బీఆర్ఎస్, బీజేపీ ఓట్లు చీలేలా చేశారు. 90 కి.మీ. దూరంలోని తాండూర్‌ను హైదరాబాద్ లోక్‌సభ సీటుకు చేర్చి ముస్లిం ఓట్లు బలోపేతం చేశారు. పశ్చిమ బెంగాల్, కేరళలో ముస్లిం, క్రిస్టియన్ ప్రాంతాల సీట్లు పెంచి, హిందూ బలమైన దక్షిణ కేరళలో సీట్లు తగ్గించారు. శ్రీరంగంలో బ్రాహ్మణులు గెలవకుండా విభజనలు చేశారని విమర్శలు వచ్చాయి.కేంద్రం మూడు బిల్లులు ప్రవేశపెట్టింది. డీలిమిటేషన్ బిల్లు?2026, మహిళా రిజర్వేషన్, కేంద్రపాలిత ప్రాంతాల సీట్ల పెంపు. లోక్‌సభ సీట్లు 50 శాతం పెంచి 816?850కి, రాష్ట్రాలకు 815, యూటీలకు 35 సీట్లు కేటాయించాలని ప్రతిపాదన. జూన్‌లో డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటు, 84వ సవరణను సవరించి 2011 డేటాతో ముందుకు సాగాలని భావించింది. ఉత్తరప్రదేశ్‌కు 120 సీట్లు, తెలంగాణకు 25, ఏపీకు 38 సీట్లు పెరిగే అవకాశం. షెడ్యూల్డ్ కులాలు, తెగలకు సీట్లు పెరుగుతాయని కేంద్రం చెబుతోంది.తెలంగాణ, తమిళనాడు సీఎంలు దక్షిణ రాష్ట్రాల సమతౌల్యం దెబ్బతింటుందని వ్యతిరేకత వ్యక్తం చేశారు. ఎంపీ సీట్ల మార్పు ఎమ్మెల్యే సీట్లను కూడా ప్రభావితం చేస్తుంది. ఉత్తర రాష్ట్రాల జనాభా ఆధారంగా సీట్లు పెరిగి దక్షిణానికి నష్టం అవుతుందని ఆందోళన వ్యక్తం చేసింది.ఇండియా కూటమి, మల్లికార్జున్‌ఖర్గే దీన్ని రాజ్యాంగ విరుద్ధ కుట్రగా, బీజేపీ హైజాక్ ప్రయత్నంగా విమర్శిస్తోంది. కేసీ వేణుగోపాల్ బిల్లును వెనక్కి తీసుకోవాలనిడిమాండ్ చేశారు. బీజేపీ ఇది జన హితమని, కాంగ్రెస్ గతంలో జనాభా ఆధారం మర్చినట్టు ఆరోపిస్తోంది.ఈ పునర్విభజన దేశ రాజకీయ ముఖచిత్రాన్ని మార్చనుంది. కాంగ్రెస్ తన 'కంచు కోటలు' కుప్పకూలుతాయని భయపడుతోంది. బీజేపీ మతపరమైన పోలరైజేషన్‌కు అనుకూలంగా మారవచ్చని ఆరోపణలు ఉన్నాయి. భవిష్యత్ ఎన్నికల్లో పార్టీల బలాలు పూర్తిగా మారే అవకాశం ఉంది.

## అప్పు ఇచ్చేందుకు నిరాకరణ..

## రిటైర్డ్ ఆర్బీఐ ఉద్యోగిని హత్య చేసిన దంపతులు

న్యూఢిల్లీ: రిటైర్డ్ ఆర్బీఐ ఉద్యోగిని దంపతులు అప్పు అడిగారు. ఆయన నిరాకరించడంతో ఘర్షణ జరిగింది. ఈ నేపథ్యంలో ఆ వ్యక్తిని హత్య చేశారు. దర్యాప్తు చేసిన పోలీసులు భార్యాభర్తలను అరెస్ట్ చేశారు. దేశ రాజధాని ఢిల్లీలో ఈ సంఘటన జరిగింది. 63 ఏళ్ల మాధో రామ్ రిటైర్డ్ ఆర్బీఐ ఉద్యోగి. భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడుతో కలిసి మందిర్ మార్గ్ ప్రాంతంలో నివసిస్తున్నాడు.కాగా, ఏప్రిల్ 19 ఆదివారం సాయంత్రం 5.30 గంటల సమయంలో ఇంటి మొదటి అంతస్తులోని గదిలో కత్తి గాయాలతో మాధో రామ్ పడి ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు అక్కడకు చేరుకున్నారు. అతడ్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు డాక్టర్లు నిర్ధారించారు. మరోవైపు మాధో రామ్ హత్యపై పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తు కోసం పోలీస్ బృందాలను ఏర్పాటు చేశారు. ఫోరెన్సిక్ బృందం సంఘటనా స్థలాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసింది. సమీప ప్రాంతాల్లోని సీసీటీవీ ఫుటేజీని పోలీసులు పరిశీలించారు. అలాగే స్థానికుల నుంచి సమాచారాన్ని సేకరించారు. దీంతో భార్యాభర్తలైన ఆజాద్ అలియాస్ జాజు, అతడి భార్య రుబీనాను పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. కాగా, గోల్ మార్కెట్ ప్రాంతంలో నివసించే ఆజాద్ టైలర్‌గా పనిచేస్తున్నాడని పోలీస్ అధికారి తెలిపారు. ఆదివారం సాయంత్రం అప్పు కోసం మాధో రామ్‌ను అతడు కలిసినట్లు చెప్పారు. డబ్బు ఇచ్చేందుకు నిరాకరించడంతో వారి మధ్య వాగ్వాదం జరిగిందని అన్నారు. ఈ నేపథ్యంలో ఆజాద్ కత్తితో మాధో రామ్‌ను పొడిచి పారిపోయినట్లు వివరించారు. అయితే ఆజాద్ భార్య రుబీనా సాక్ష్యాలను నాశనం చేసేందుకు ప్రయత్నించినట్లు పోలీస్ అధికారి తెలిపారు. రక్తం మరకలు ఉన్న ఆజాద్ దుస్తులను ఆమె ఉతికిందని చెప్పారు. నేరాన్ని అంగీకరించిన నిందితులైన భార్యాభర్తలను అరెస్ట్ చేసినట్లు పోలీస్ అధికారి వెల్లడించారు.





# వ్యక్తిగత దూషణల్లో నేతలు..

# ఇద్దరూ... ఇద్దరే


**హైదరాబాద్,తెలంగాణ దిశ :** దేశంలో మిగతా రాష్ట్రాలు వేరు.. తెలంగాణ వేరు. తెలంగాణ ఉత్తి పుణ్యానికి రాలేదు. బలిదానాల మీద.. ఆత్మ త్యాగాల మీద వచ్చింది. ఆశయాల సాధన మీద ఏర్పడింది. అందుకే తెలం గాణ అంటే ఒక పౌరుషం.. తెలంగాణ అంటే బలమైన ఆశయం. తెలంగాణ అంటే పిడికిలి బిగించిన నినాదం. సబ్బండవర్ణాలు రోడ్ల మీదికి వచ్చి ధర్నాలు, నిరసనలు, మిలియన్ మార్చ్ లు, వంటా వార్పులు చేస్తేనే తెలంగాణ ఏర్పడింది. అతడు తెలంగాణలో నాయ కులు మాట్లాడుతున్న మాటలు చూస్తే జాలి కలుగుతుంది. తెలంగాణలో మర్యాదలు ఎక్కువ గా ఉంటాయి. వ్యక్తిగత గౌరవానికి భంగం కలిగితే తిట్టే తిట్లు కూడా అదే స్థాయిలో ఉంటాయి. ఉద్య మాన్ని శంకించిన వారికి.. తెలంగాణ ప్రజల నుంచి ఎటువంటి తిట్లు ఎదురయ్యాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అటువంటి సామాజిక ఐక్యత తెలంగాణ ప్రజల్లో నిండి ఉంది కాబట్టి స్వరాష్ట్ర సాధన సాధ్యమైంది. అంతటి గొప్ప విద్వత్తు ఉన్న తెలంగాణ రాష్ట్రంలో రాజకీయ నాయకులు మాట్లాడుతున్న మాటలు బాధ కలిగిస్తున్నాయి. ఇందుకేనా తెలంగాణ తెచ్చుకున్నది అనే ఆవేదనను వ్యక్తం చేస్తున్నాయిరాజకీయ నాయకులు అధికారం కోసం మాత్రమే పాకులాడుతారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధి అనేది వట్టి మాటలు మాత్రమే. ఏదో రాజకీయ ప్రాపకం కోసం అభివృద్ధి చేసినట్టు.. సంక్షేమానికి పాటుపడినట్టు కలరింగ్ ఇస్తుంటారు. లేకపోతే 2014లో మిగులు బడ్జెట్ తో తెలంగాణ ఏర్పడింది. కెసిఆర్ దిగిపో యే నాటికి రెవెన్యూ లోటుకు దిగజారింది. రేవంత్ పరిపాలనలో కూడా అదే సన్నివేశం కొనసాగుతోంది.. పదవి విరమణ చేసిన ఉద్యోగులకు కనీసం రిటైర్మెంట్ బెనిఫిషరీస్ చెల్లించడంలో ప్రభుత్వం విఫలమవుతోంది.దీనిని బట్టి తెలంగాణఆర్థిక పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు..త్యాగాల మీద ఏర్పడిన తెలంగాణ ఇలా కావడా నికి ముమ్మాటికి రాజకీయ నాయకులు కారణం. అధికారకాంక్ష.. స్వార్థం.. భారీగా వెనకేసుకోవడం వంటివాటి వల్ల తెలంగాణ సంపద మొత్తం రాజకీయ నాయకుల జేబుల్లోకి చేరిపోయింది. మద్యం అమ్మకాలు గనుక లేకుంటే తెలంగాణలో ఉద్యోగులకు వేతనాలు ఇచ్చే పరిస్థితి కూడా లేదు. నిష్టూరంగా ఉన్నప్పటికీ ఇదే కఠిన నిజం. రాజకీయ నాయకుల వ్యవహార శైలి వల్ల తెలంగాణ పరువు పోతోంది అని చెప్పుకున్నాం కదా.. అది మరోసారి నిరూపితమైంది.. జగిత్యాల సభలో కేసీఆర్ కాంగ్రెస్ నాయకులను ఉద్దేశించి ఏం బీమారివచ్చింది? ఏ మాయ రోగం? లాగులు ఇడ్చి కొట్టాలే.. నన్ను ఏం చేస్తావ్ నా కొడకా..ఇటువంటి మాటలుమాట్లాడారు. వాస్తవానికి కెసిఆర్ నుంచి ఇంతకంటే గొప్పగా తెలంగాణ సమాజం ఆశించదు. కఠినంగా ఉన్నప్పటికీ ఇదే నిజం. కాకపోతే కెసిఆర్ గత సంభాషణలు ఉంటే ఆయన నోటి నుంచి వచ్చిన ఆణిముత్యాలు ఎంత గొప్పగా ఉన్నాయో అర్థం అవుతుంది.రేవంత్ రెడ్డి కూడా ఇందులో తక్కువ తినలేదు. భూపాలపల్లి జిల్లాలో జరిగిన బహిరంగ సభలో జీవన్ రెడ్డిని గట్టిగానే తిట్టారు. కాంగ్రెస్ పార్టీ ఏం చేసింది.. జీవన్ రెడ్డి ఎందుకు మోసం చేశాడు.. అనే అంశాలపై రేవంత్ లోతుగానే మాట్లాడారు. కొన్ని సందర్భాలలో రేవంత్ రెడ్డి అదుపుతప్పారు. ఇక కెసిఆర్ ను కూడా అదే స్థాయిలో విమర్శించారు. కర్కోటకుడు అని సంబోధించారు. పాపాత్ముడు అంటూ మండిపడ్డారు.. కెసిఆర్ లాంటి ద్రోహిని వదిలిపెట్టే సవాల్ లేదని శపథం చేశారు.అటు రేవంత్ రెడ్డి, ఇటు కెసిఆర్ సీనియర్ నాయకులు. తిట్టుకుంటూనే రాజకీయమంటే అంతకు మించిన మూర్ఖత్వం ఉండదు. వ్యక్తిగత కోపాలు ఉంటే నేరుగా తేల్చుకోవాలి. అలాకాకుండా జనాన్ని ప్రభావితం చేసే విధంగా మాట్లాడటం ఎందుకు. రాజకీయాలు అంటే వ్యక్తిగత కక్షలకు వేదికలు కావు కదా.. విధానాలపరంగా నేతలను విమర్శించాలి. ఏవైనా తప్పులు చేస్తే ఎండగట్టాలి. అక్రమాలకు పాల్పడితే న్యాయస్థానాలకు ఈడ్చాలి. అలా కాకుండా ఇలా తిట్టుకోవడం.. వ్యక్తిగత దూషణలకు పాల్పడటం ఎటువంటి రాజకీయాలకు నిదర్శనమో కెసిఆర్, రేవంత్ రెడ్డి చెప్పాలి. ఇటువంటి రాజకీయాల కోసం కాదు తెలంగాణ తెచ్చుకుంది.

# సినిమా



### రామ్ చరణ్ సర్, నాకు మరో అవకాశం ఇవ్వండి..

# బుచ్చిబాబు స్పెషల్ రిక్వెస్ట్




మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ప్రస్తుతం తన కొత్త సినిమా 'పెద్ది' షూటింగ్‌లో బిజీగా ఉన్నాడు. ఈ సినిమాను బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తున్నారు. గ్రామీణ నేపథ్యంలో సాగే ఎమోషనల్ స్పోర్ట్స్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమాపై మొదటి నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. మొదట ఈ సినిమాను ఏప్రిల్ 30న విడుదల చేయాలని ప్లాన్ చేసినప్పటికీ, కొన్ని కారణాల వల్ల వాయిదా పడింది. కొత్త రిలీజ్ డేట్‌పై ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన లేదు. అయితే సినిమా ఔట్‌పుట్ విషయంలో ఎక్కడా రాజీ పడకుండా మేకర్స్ జాగ్రత్తలు తీసుకుంటున్నారని సమాచారం.

ఇటీవల రామ్ చరణ్ ఒక ప్రముఖ మ్యాగజైన్ కోసం చేసిన స్టైలిష్ ఫోటోషూట్ సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఆ ఫోటోలపై స్పందిస్తూ డైరెక్టర్ బుచ్చిబాబు సానా "సార్... వన్ మోర్ ఛాన్స్ ప్లీజ్" అంటూ కామెంట్ చేయడం అభిమానులను ఆకట్టుకుంది. వీరిద్దరి మధ్య ఉన్న స్నేహం, అనుబంధం చూసి ఫ్యాన్స్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. 'పెద్ది' తర్వాత కూడా ఈ కాంబినేషన్ మళ్లీ రిపీట్ అవుతుందా అనే ఆసక్తి అభిమానుల్లో పెరుగుతోంది. అయితే దీనిపై అధికారిక సమాచారం మాత్రం ఇంకా బయటకు రాలేదు. ఇక ఈ సినిమాలో హీరోయిన్‌గా జాన్వీ కపూర్ నటిస్తోంది. ఈ చిత్రానికి సంగీతాన్ని ఆస్కార్ అవార్డు గ్రహీత ఏ ఆర్ రెహమాన్ అందిస్తున్నారు. ఆయన సంగీతం ఈ సినిమాకు మరో పెద్ద ప్లస్ అవుతుందని భావిస్తున్నారు.

ఇదిలా ఉండగా, ఈ సినిమాలో ఒక స్పెషల్ మాస్ సాంగ్ ఉండబోతుందనే వార్తలు ఇప్పుడు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారాయి. సాధారణంగా బుచ్చిబాబు సినిమాల్లో పాటలకు మంచి ప్రాధాన్యం ఉంటుంది. ముఖ్యంగా ప్రేక్షకులను ఆకట్టుకునే మాస్ పాటలు ఆయన స్టైల్. ఈ స్పెషల్ సాంగ్‌లో రామ్ చరణ్‌తో కలిసి ఎవరు డ్యాన్స్ చేస్తారు అనే విషయంపై చాలా రోజులుగా చర్చ జరుగుతోంది. తాజా సమాచారం ప్రకారం ఈ అవకాశం మృణాల్ ఠాకూర్‌కి వచ్చినట్లు తెలుస్తోంది. 'సీతారామం',

'హాయ్ నాన్న' సినిమాలతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన మృణాల్, ఇప్పుడు మొదటిసారి మాస్ సాంగ్‌లో కనిపించబోతుందనే వార్తలు ఫ్యాన్స్‌లో ఆసక్తిని పెంచుతున్నాయి. ఇటీవల ఆమె నటించిన మరో సినిమాపై రామ్ చరణ్ ప్రశంసలు కురిపించడం కూడా ఈ వార్తలకు మరింత బలం చేకూర్చింది. ఇక ఏ ఆర్ రెహమాన్ అందించిన ఈ మాస్ ట్యూన్ థియేటర్లలో ప్రేక్షకులను ఉర్రూతలూగించేలా ఉంటుందని సినీ వర్గాలు చెబుతున్నాయి.

# మే 1న జెట్లీ ఆగమనం..



కమెడియన్ సత్య హీరోగా నటిస్తున్న సినిమా 'జెట్లీ'. 'మత్తు వదలరా' ఫేమ్ రితేష్ రాణా దర్శకత్వంలో ఈ సినిమాను చిరంజీవి (చెర్రీ), హేమలత పెద్దామల్లు నిర్మిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ ప్రెజెంటర్‌గా వ్యవహరిస్తోంది.

ఏప్రిల్ 30న రావాల్సిన రామ్ చరణ్ 'పెద్ది' సినిమా జూన్‌కు వాయిదా పడడంతో ఇప్పుడీ సినిమాను మే 1న విడుదల చేస్తున్నారు. అయితే మే 1వ తేదీన తరుణ్ భాస్కర్ 'గాయపడ్డ సింహం' సినిమా కూడా విడుదల కాబోతోంది. ఇక 'జెట్లీ' మూవీ విషయానికి వస్తే ఈ సినిమాతో మిస్ యూనివర్స్ ఇండియా రియా సింఘా హీరోయిన్‌గా టాలీవుడ్ ఎంట్రీ ఇస్తోంది. ఇప్పటికే ఈ సినిమా నుండి వచ్చిన ఫస్ట్ లుక్ పోస్టర్స్, ఫన్ గ్లింప్స్, సత్య ఈజ్ నాట్ జెట్లీ ప్రమోషనల్ సాంగ్‌కు మంచి స్పందన లభించింది.

తాజాగా మేకర్స్ రిలీజ్ డేట్‌ను ప్రకటించడం విశేషం. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్‌లో సత్య, వెన్నెల కిశోర్ యాక్షన్ బ్యాక్‌డ్రాప్‌లో డైనమిక్‌గా నడుస్తూ వస్తుండటం ఆకట్టుకుంటోంది. ఈ సినిమాకు కాలభైరవ సంగీతాన్ని అందించారు.

# 'హాయ్ నాన్న' దర్శకుడితో విజయ్ దేవరకొండ..




## క్రేజీగా అనౌన్స్‌మెంట్ పోస్టర్!

టాలీవుడ్ రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ తన తదుపరి చిత్రాన్ని 'హాయ్ నాన్న' ఫేమ్ యువ దర్శకుడు శౌర్యువ్‌తో చేయబోతున్నట్లు అధికారికంగా ప్రకటించారు. వైరా ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై రూపొందుతున్న ఈ ప్రతిష్టాత్మక చిత్రం కోసం ప్రపంచ స్థాయి సాంకేతిక నిపుణులను రంగంలోకి దించుతున్నట్లు విజయ్ సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. ఈ భారీ యాక్షన్ అడ్వెంచర్ కోసం హాలీవుడ్ విజువల్ ఎఫెక్ట్స్ నిపుణుడు ఎరిక్ డర్స్ట్, అంతర్జాతీయ సినిమాటోగ్రాఫర్ అలెజాండ్రో మార్టినెజ్, ప్రముఖ ఎడిటర్ ప్రవీణ్ ఆంటోనీ, ఆర్ట్ డైరెక్టర్ సురేష్ సెల్వరాజన్ మరియు కాస్ట్యూమ్ డిజైనర్ సచిన్ లోవలేకర్ వంటి హేమాహేమీలు పనిచేయబోతున్నారు. 'ఖుషి' చిత్రానికి అద్భుతమైన సంగీతాన్ని అందించిన హేషమ్ అబ్దుల్ వహాబ్ ఈ సినిమాకు కూడా బాణీలు కడుతున్నాడు. ఈ సందర్భంగా విజయ్ దేవరకొండ భావోద్వేగంగా స్పందిస్తూ, శౌర్యువ్ అద్భుతమైన ఊహాశక్తితో తెరకెక్కుతున్న ఈ సినిమా చాలా సవాల్‌తో కూడుకున్నదని, దీనికోసంతన శాయశక్తులా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. శౌర్యువ్ మొదటి చిత్రం 'హాయ్ నాన్న' క్లాస్ మూవీగా గుర్తింపు పొందగా, ఈ కొత్త చిత్రం దానికి పూర్తి భిన్నంగా భారీ యాక్షన్ ఎపిసోడ్లతో గ్లోబల్ స్థాయిలో ఉండబోతోందని చిత్ర బృందం వెల్లడించింది.

# విష్ణుప్రియ దారిలోనే మరికొందరు..






నటి, యాంకర్ విష్ణుప్రియ దారినే సెలబ్రిటీలు కొందరు ఫాలో అవుతున్నారు. రీసెంట్‌గా విష్ణుప్రియ తన ఇన్‌స్టాగ్రామ్‌లో అసభ్యకర ఫొటోలను షేర్ చేస్తూ, సబ్‌స్క్రిప్షన్ పేరుతో డబ్బు వసూలు చేస్తున్నట్లుగా, విజయవాడకు చెందిన ఏఐఎస్ఎఫ్ నాయకులు కొందరు.. ఆమెపై సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. నటి, యాంకర్ విష్ణుప్రియ దారినే సెలబ్రిటీలు కొందరు ఫాలో అవుతున్నారు. రీసెంట్‌గా విష్ణుప్రియ తన ఇన్‌స్టాగ్రామ్‌లో అసభ్యకర ఫొటోలను షేర్ చేస్తూ, సబ్‌స్క్రిప్షన్ పేరుతో డబ్బు వసూలు చేస్తున్నట్లుగా, విజయవాడకు చెందిన ఏఐఎస్ఎఫ్ నాయకులు కొందరు.. ఆమెపై సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. విష్ణుప్రియ అసభ్యకర కంటెంట్‌తో జనాలను ఆకర్షిస్తూ, సబ్‌స్క్రిప్షన్ ఆప్షన్‌తో భారీగా డబ్బు సంపాదిస్తుందని, సబ్‌స్క్రిప్షన్ తీసుకున్న వాళ్లకి ఎక్స్‌క్లూజివ్ క్లిప్స్ అంటూ, కుర్రాళ్లను తప్పుదోవ పట్టిస్తుందనేది వారి వాదన. ఒక్క విష్ణు ప్రియ మాత్రమే కాదు, సోషల్ మీడియాలో సెర్చ్ చేస్తే, ఇలాంటి వారు చాలామందే ఉన్నారు. అవకాశాలు లేక కొందరు, అవసరం కోసం కొందరు.. ఇలా,ఈ మధ్యకాలంలో ఇన్‌కమ్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ బాటలో తెలుగు హీరోయిన్లు కూడా కొందరు నడిచేందుకు సిద్ధమవుతున్నట్లుగా సోషల్ మీడియాలో టాక్ నడుస్తోంది. సినిమా అవకాశాలు రాకపోతే ఏం చేస్తారు? తన టీమ్‌ని, ఫ్యామిలీని పోషించాలంటే మనీ అవసరం కాబట్టి.. ఇలాంటి పనులకు దిగుతున్నారని, ఇది వారికొక ఆదాయ మార్గంగా మారిందనేది, వీళ్లని ఫాలో అయ్యే వారి వాదన. ఎంత అవకాశాలు లేకపోతే మాత్రం.. ఇంతగా దిగజారాలా? అంతగా అయితే, ఇండస్ట్రీకి గుడ్ బై చెప్పి, పెళ్లి చేసుకుని హాయిగా జీవితాన్ని అనుభవించక, ఎందుకు నిత్యం వార్తల్లో నిలవడం అంటూ.. ఇలాంటి వారికి కొందరు హితబోధ చేస్తున్నారు. నిజమే, అలా కూడా చేయవచ్చు కానీ, ఎవరికి ఎలాంటి అవసరాలు ఉన్నాయనేది? వాళ్లకి మాత్రమే తెలుసు. కాబట్టి పై నుంచి చూసి, జడ్జ్ చేయడం కూడా ఏమంత కరెక్ట్ కాదు. విష్ణుప్రియనే తీసుకుంటే.. ఈ వ్యవహారం బయటకు రాకముందు ఆమెకు ఉన్న ఫాలోయర్స్ కేవలం వందల్లోనే. కానీ, ఎప్పుడైతే కేసుల వరకు వెళ్లిందో.. సడెన్‌గా ఆమెను ఫాలో అయ్యే వారి సంఖ్య వేలకు మారింది. కొన్నిసార్లు ఇలాంటి కేసులు కూడా వారిని మరింత ఫేమస్ చేస్తాయనేది, విష్ణుప్రియ వ్యవహారంలో నిరూపితమైంది. ఇంతకు ముందు బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ రూపంలో వీరికి అదనపు ఆదాయం లభించేది. ఇప్పుడది లేదు. అందుకే, సబ్‌స్క్రిప్షన్ పేరుతో వారి శరీరాన్నే ఆదాయంగా చేసుకోవాలని భావిస్తున్నారు. మరి ఎంతకాలం ఇది సాగుతుందో, పోలీసులు దీనిపై ఎలాంటి యాక్షన్ తీసుకుంటారనేది మాత్రం చూడాల్సి ఉంది.

# సిద్ధార్థ్-అదితి ప్రేమకథ మరోసారి వైరల్

## పుట్టినరోజు శుభాకాంక్షలతో ఆకట్టుకున్న స్టార్ జంట





టాలీవుడ్, కోలీవుడ్, బాలీవుడ్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా నిలిచిన స్టార్ జంట సిద్ధార్థ్ – అదితి రావు హైదరి మరోసారి సోషల్ మీడియాలో చర్చనీయాంశమయ్యారు. ప్రేమతో ప్రారంభమైన వీరి బంధం వివాహంతో మరింత బలపడగా, పెళ్లి తర్వాత కూడా ఈ జంట అన్యోన్యతతో అభిమానులను ఆకట్టుకుంటోంది. పెళ్లి తర్వాత వీరిద్దరూ తమ వ్యక్తిగత జీవితాన్ని ఎంతో హుందాగా, సంతోషంగా గడుపుతున్నారు. ముఖ్యంగా సిద్ధార్థ్ తన భార్య అదితిపై చూపించే ప్రేమ, గౌరవం తరచూ ప్రజల్లో చర్చకు దారి తీస్తోంది. పబ్లిక్ ఈవెంట్లు, ఇంటర్వ్యూలలో కూడా అదితి గురించి మాట్లాడటం ద్వారా ఆమెకు తన జీవితంలో ఉన్న ప్రాధాన్యతను వెల్లడిస్తున్నాడు. సిద్ధార్థ్ పుట్టినరోజు సందర్భంగా అదితి చేసిన పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఎంతో ప్రత్యేకంగా ఆయనను "మ్యానికార్న్" అంటూ పిలుస్తూ చేసిన శుభాకాంక్షలు అభిమానులను ఆకట్టుకున్నాయి. ఈ పిలుపు వెనుక వారి మధ్య ఉన్న ప్రత్యేక అనుబంధం, ప్రేమను ప్రతిబింబిస్తోందని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. అదితి తన పోస్ట్‌లో సిద్ధార్థ్‌ను సూర్యుడితో పోలుస్తూ, "నా జీవితానికి వెలుగు నీవే, నా నవ్వుల వెనుక కారణం నీవే" అంటూ భావోద్వేగంగా వర్ణించారు. ఆమె షేర్ చేసిన అందమైన ఫోటోలు ఈ జంట మధ్య ఉన్న అనుబంధాన్ని మరింత స్పష్టంగా చూపించాయి. ఈ పోస్ట్ చూసిన అభిమానులు, సినీ ప్రముఖులు సిద్ధార్థ్‌కు శుభాకాంక్షలు తెలుపుతూ, ఈ జంట ఇలాగే కలకాలం సంతోషంగా ఉండాలని కోరుకుంటున్నారు. సంప్రదాయబద్ధంగా ఒక పురాతన ఆలయంలో వివాహం చేసుకున్న ఈ జంట, గ్లామర్ ప్రపంచానికి అతీతంగా నిజ జీవితంలోనూ ఆదర్శ దంపతులుగా నిలుస్తున్నారు. ఒకరినొకరు అర్థం చేసుకుంటూ, గౌరవించుకుంటూ ముందుకు సాగుతున్న వీరి బంధం అనేక మందికి స్ఫూర్తిగా నిలుస్తోంది. కెరీర్ విషయానికి వస్తే, అదితి ప్రస్తుతం 'పరివారిక్ మనురంజన్', 'లయనెస్' వంటి హిందీ చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉన్నారు. మరోవైపు సిద్ధార్థ్ 'పరమ్ సుందరి' తర్వాత 'వివాన్ -- ఫోర్స్ ఆఫ్ ది ఫారెస్ట్' సినిమాలో నటిస్తున్నారు. అయితే ఇటీవల ఆయనకు అవకాశాలు కొంత తగ్గినప్పటికీ, తనదైన శైలిలో మళ్లీ రీ-ఎంట్రీ ఇవ్వాలని అభిమానులు ఆశిస్తున్నారు.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. RNI. NO: TELTEL/2023/88215